TANA conducted 2-day workshop for Competitive Math Tricks for different age groups: Grades 2-3 and Grades 4-5 in association with happyhourmath.com. TANA North West Regional Coordinator Devendra Lavu and TANA New Jersey Regional Coordinator Raja Kasukurthi organized this online zoom workshop and Srikar Surapaneni taught the class to kids.

Srikar Surapaneni is a self-made mathematician, self-made magician and he won several talent awards like Math Counts National championship. Kids learned several tricks to do easy multiplication, division and roots. Srikar Surapaneni explained several methods to solve tricky math problems and showed how it would help kids to for competitive tests. In the same session Srikar showed different math magics and all kids loved to do that.

TANA received lot of positive comments from kids and parents regarding this workshop and several parents asked to do this workshop again. Thanks to TANA President Jay Talluri, Executive Vice President Anjaiah Chowdary Lavu, Secretary Ravi Potluri, Treasurer Sateesh Vemuri for encouraging to do these kind of workshops to educate kids and thanks to Sowmya Surapaneni, Padma Bhogavalli, Srinivas Oruganti and Sai Paleti for coordinating this workshop. Special thanks to Srikar Surapaneni for coming forward to do Math Tricks workshop and spread the knowledge.

# తానా నవలల పోటీ - 2021

## ఉత్తమ నవలకు 2 లక్షల రూపాయల బహుమతి

ఉత్తర అమెరికా తెలుగు సంఘం – తానా (TANA) ప్రతి రెండేళ్లకు ఒకసారి నిర్వహించే నవలల పోటీని ఈ సంవత్సరం కూడా రెండు లక్షల రూపాయల బహుమతితో కొనసాగించాలని తానా కార్యవర్గం నిర్ణయించింది. 1997 నుంచి మధ్యలో కొంతకాలం విరామంతో తానా నవలల పోటీ నిర్వహిస్తోంది. 2017లో తానా నిర్వహించిన నవలల పోటీలో బహుమతికి ఎంపికైన ***శప్తభూమి, నీల, ఒంటరి,*** 2019 పోటీలో బహుమతి మొత్తం రెండు లక్షలు గెలుచుకొన్న **కొండపొలం** నవలలు సాహితీలోకంలో ఒక కదలికను తీసుకొచ్చాయి. తెలుగు నవలారంగంలో కొంతకాలంగా కనబడుతున్న స్తబ్ధతకు ఈ పోటీల వల్ల కొంత సడలింపు వచ్చింది. ఈ వాతావరణానికి కొనసాగింపుగా తెలుగు సాహిత్యంలోనూ, ప్రపంచ సాహిత్యంలోనూ కలకాలం నిలబడే నవలలను వెలికి తీసుకురావాలనే తానా ప్రయత్నానికి స్పందించి ఈ పోటీలో పాల్గొనవలసిందిగా తెలుగు రచయితలందరికీ విజ్ఞప్తి చేస్తున్నాము.

### నిబంధనలు

- నవలలు తెలుగు జీవితాన్ని ప్రతిబింబించాలి.
- ప్రపంచంలోని ఎక్కడివారయినా ఈ పోటీకి నవలలు పంపించవచ్చు.
- నవలకు పేజీల పరిమితి లేదు.
- బహుమతికి ఎంపిక కాని నవలలను తిప్పిపంపడం సాధ్యంకాదు. కాబట్టి జిరాక్స్ కాపీలు కూడా పంపవచ్చు.
- నవలలు తమ స్వంతమని, అనువాదాలు, అనుసరణలు కావని, ఇంతకుముందు ఎక్కడా ప్రచురితం కాలేదని, ఎక్కడికీ ప్రచురణకు పంపలేదని, తానా పోటీ ఫలితాలు వచ్చేవరకూ ఏ ప్రచురణకు, పోటీకి పంపబోమని పేర్కొంటూ హామీపత్రాన్ని జతచేయాలి.
- నవలలు తప్పనిసరిగా స్పష్టమైన చేతివ్రాతతో కాని, డిటిపి చేసికాని పంపాలి.
- డిటిపి చేసిన నవలలను **2021tananovel@gmail.com**కు పంపవచ్చు.
- నవలల పై రచయిత పేరు, చిరునామా ఉండకూడదు. అవన్నీ కవరింగ్ లెటర్ పై ఉండాలి.
- నిర్వాహకుల నిర్ణయాలపై ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలకు తావులేదు. వివాదాలన్నింటినీ అమెరికాలోని మేరీలాండ్ రాష్ట్ర న్యాయపరిధిలో పరిష్కరించుకోవాలి.
- **బహుమతి పొందిన నవల ఉన్నత ప్రమాణాలను అందుకునేటట్లుగా ఉండాలన్నది తానా ఆకాంక్ష. ఆ ప్రమాణాలను అందుకునే నవలలు పోటీకి రాని పక్షంలో బహుమతి ఇవ్వకపోవడం కానీ లేదా పూర్తి బహుమతి తగ్గించడం కానీ, ఒకటి కంటే ఎక్కువ నవలల మధ్య పంచడం కానీ తానా నిర్ణయం ప్రకారం జరుగుతుంది.**
- **బహుమతికి ఎంపికైన నవల మొదటి రెండు ముద్రణలను, ఇతర పారితోషికం ఏమీ లేకుండా ప్రచురించే హక్కు తానాకు ఉంటుంది.**
- **2019లో బహుమతి పొందినవారు ఈ పోటీలో పాల్గొనరాదు.**

---

**రచనలు అందవలసిన ఆఖరు తేది: 15 ఏప్రిల్ 2021**

---


రచనలు పంపవలసిన చిరునామా

**అక్షర క్రియేటర్స్, ఎజి-2,**
**'ఏ' బ్లాక్, మాతృశ్రీ అపార్ట్‌మెంట్స్,**
**హైదర్‌గూడ, హైదరాబాద్-500029.**

ఇతర వివరాలకు సంప్రదించండి

**ఫోన్స్: 98493 10560**
**040-2970 1939**
**Email: 2021tananovel@gmail.com**

**జయశేఖర్ తాళ్లూరి**
తానా అధ్యక్షులు

**జంపాల చౌదరి**
కార్యక్రమ నిర్వాహకులు

**చంద్ర కన్నెగంటి**
తానా ప్రచురణల కమిటీ అధ్యక్షులు

కథ



* సాయిబ్రహ్మానందం గొర్తి

# వూడూ డాల్



“అయితే నీ ఫైనల్ డెసిషన్ అదేనంటావు...” సూటిగానే అడిగాను.

చేతిలోవున్న కారమిల్ ఐస్ కాఫీ సిప్ చేస్తూ, అవున్నట్లు తల దించుకునే తలూపింది క్రిష్.

అప్రయత్నంగా హైస్కూల్లో చదివిన ఆడెస్సీలో వాక్యాలు గుర్తుకొచ్చాయి.

‘Much have I suffered, labored long and hard by now in the waves and wars. Add this to the total-bring the trial on!’



"ఇంకొక్కసారి ఆలోచించు. నాకెందుకో నువ్వు తొందరపడుతున్నావనిపిస్తోంది... ఒకర్ని చూసి మరొకరని పొరబడ్డావేమో...? ఎప్పుడో జరిగినవన్నీ మర్చిపోయావనే అనుకున్నాను..." మరోసారి రెట్టించాను.

"గాయాలు శరీరంలో భాగం అయిపోతాయి రాన్!"

"క్రిష్- గాయాలు మానవు ఒప్పుకుంటాను. ఇలా ఊడూ డాల్ మీద సూదులు గుచ్చుకుంటూ బ్రతకడం అవసరమా?"

"ఊడూ డాల్...? వాట్ ఈజ్ యిట్..." ఆశ్చర్యంగా చూసింది.

"గూగుల్ ఇట్... నీకే తెలుస్తుంది..." అనేసి వదిలేసాను.

క్రిష్ నా చిన్ననాటి స్నేహితురాలు. మాంటవిస్తా హైస్కూల్లో ఉండగా పరిచయమయ్యింది, సోఫమోర్ ఇయర్‌లో ఉండగా మిల్‌పిటస్ హైస్కూలు నుండి మా స్కూల్‌కి బదిలీ అయ్యి వచ్చింది. ఇద్దరం ఒకటే క్లాస్. మొదటిసారి ఆమె వాలకం చూడగానే ఇండియన్ అని అర్థమయ్యింది. ఆమె అసలు పేరు 'కృ..ష్ణ..వే..ణ్ణి'. ఇప్పటికీ అది పలకడం కష్టమే. యాక్సెంట్‌తో నత్తుకుంటూ పిలవడం కష్టమయ్యి, నేనే క్రిష్ అని పిలుస్తాను.

"అతను జస్టినే అని ఖచ్చితంగా ఎలా చెప్పగలవు? ఇరవయ్యేళ్ల కాలంలో పోలికలు మారతాయి. నా చిన్నపటి ఫోటో చూస్తే నేనేనా అని ఆశ్చర్యపోతూ వుంటాను ఇప్పటికీ..."

అసహనంగా నాకేసి చూసింది.

గట్టిగా నిట్టూరుస్తూ- "ఖచ్చితంగా అతనే! ఒకటికి వందసార్లు చెక్ చేశాకే నీకు చెప్పాను. మా కంపెనీలో నేను ఇంటర్వ్యూలు చెయ్యను. నా క్రింద పనిచేసే మేనేజర్‌లే చూస్తారు. సిలికాన్ వ్యాలీ గురించి నీకు తెలియందేముంది? మంచి ఇంజనీర్లు దొరకడం కష్టం. అదీ ఆర్కిటెక్ట్ లెవల్లో. నా దగ్గర పనిజేసే మ్యానేజర్ నన్ను ఒకసారి మాట్లాడి ఫైనలైజ్ చెయ్యమని పోరితే సరేనన్నాను... అలా అతని రెస్యూమె చూసాను..." చెప్పింది.



క్రిష్ 'కెనటో నెట్వర్క్స్' కంపెనీ ఇంజనీరింగ్ వైస్ ప్రెసిడెంట్. అతి తక్కువ కాలంలో ఆ పొజిషన్‌కి ఎదిగింది.

తిరిగి నేనేమీ అనకపోయేసరి తనే చెప్పడం మొదలుపెట్టింది.

"ముందు రెజ్యూమేలో పేరు చూసి అంతగా పట్టించుకోలేదు. నా వంతు ఇంటర్వ్యూ వచ్చేసరికి ముందుగానే ఖాళీ దొరకడంతో ఆ రూమ్ వైపుగా వెళ్లాను.

"గ్లాస్ డోరులోంచి తొంగి చూసినప్పుడు పోలికలు చూసి ఎక్కడో చూసినట్లుందే అనుకొని దూరం నుండే కాస్త తీక్షణంగా పరికించి చూశాను. అతనే అని ఖచ్చితమైన నిర్ణయానికి వచ్చాను. లింక్‌డ్ ఇన్‌లో అతని వివరాలు వెతికాను. ఐయామ్ హండ్రెడ్ పెర్సెంట్ ష్యూర్..." గట్టిగా అంది.

ఆలోచనలో పడ్డాను. ఏం చెప్పాలో తెలీలేదు.

"క్రిష్! నీ బాధ అర్థం చేసుకోగలను. నువ్వు అనవసరంగా కొత్త సమస్యలు సృష్టించుకుంటున్నావేమో అనిపిస్తోంది..."

క్రింది పెదవి కొరుక్కుంటూ ఆలోచనలో పడింది క్రిష్.

నుదిటి మీద చెమట బిందువులు స్పష్టంగా చెబుతున్నాయి ఆమె ఆవేశాన్ని.

"ఇన్నాళ్లకి నాకీ అవకాశం దొరికింది. అతన్ని ఏమీ చెయ్యను. కనిపించని కత్తితో నరుకుతాను..." అంది.

ప్రతీకారానికి తర్కమూ, వివేచనా వుండవు; అవకాశం అందుకోవడం తప్ప.

"నువ్వెంత చెప్పినా నేనొక విక్టిమ్‌ని. ఏం నరకం అనుభవించానో నీకూ తెలుసు. ఐ యామ్ నాట్ యాన్ ఈడియట్! కవుకు దెబ్బలు కొట్టడం మేనేజ్‌మెంట్‌లో బాగానే నేర్చుకున్నాను..." అంది లేచి వెళ్లబోతూ.

ఏం చెప్పాలో తెలియడంలేదు. మరోసారి ఆలోచించుకోమని చెప్పాను.

విసురుగా తన కారు వైపు వెళుతూ వెనక్కి తిరిగి

వచ్చి, వచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ, తను వేసుకున్న షర్ట్ బటన్స్ తీసి చూపించింది.

ఆమె గుండెల మీద గోళ్లు గీకిన మచ్చలు.

"నువ్వెంత చెప్పినా నేను సముదాయించుకోలేను రాన్! హి టచ్డ్ మై బ్రెస్ట్స్ ఇన్ ఫ్రంట్ ఆఫ్ మై క్లాస్‌మేట్స్... ఫకింగ్ బాస్టర్డ్...!"

ఆమె అంత కాకపోయినా, నేనూ క్రిష్‌లా ఒక విక్టిమ్‌నే.

ముఖ్యంగా జస్టిన్ చేతిలో.

*

ఇరవయ్యేళ్ల క్రితం నాటికీ, ఇప్పటి క్రిష్‌కీ పోలికే లేదు.

నేను సోఫమోర్‌గా ఉన్నప్పుడు క్రిష్ వేరే స్కూలు నుండి మా స్కూల్‌కి ట్రాన్స్‌ఫర్ అయింది. ఎవరితోనూ అంతగా కలిసేది కాదు.

కాస్త ఆడ్‌గా అనిపించింది, మొదటిసారి చూసినప్పుడు.

ఓరోజు కెమిస్ట్రీ ల్యాబ్‌లో కాలిక్యులేటర్ కనిపించడం లేదని ఎవరో గట్టిగా అరుస్తున్నారు. అప్పటికే క్లాస్ పూర్తయ్యి బయటకెళ్ళిపోతున్నారందరూ.

ఎవరాని వెళ్లి చూస్తే ఒకమ్మాయి ప్రతీ డెస్కూ వెతుకుతూ కనిపించింది.

గుర్తులు చెబుతూ నన్నూ అడిగిందామె.

నాకున్న స్నేహితులు కూడా తక్కువ. పైగా నల్ల జాతీయుణ్ణి. అంత త్వరగా ఎవరూ మాతో కలవరు. అది నాకు అనుభవమే. కలిసినా అదంతా పైపైనే. మా స్కూల్ నిండా తెల్లవాళ్లూ, ఏసియన్స్ ఎక్కువ. బాస్కెట్ బాల్ టీములో కూడా అతి కష్టమ్మీద చోటు దొరికింది.

జస్టిన్ వాడి ఫ్రెండ్సూ కాలిక్యులేటర్ తీసి ఎక్కడో పెట్టారని చెప్పిందామ్మాయి. ఎంత వెతికినా దొరకలేదు.


ఆ సాయంత్రం క్లాస్ అయ్యాక ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో జస్టిన్, వాడి స్నేహితులకి కాలిక్యు లేటర్ చూపిస్తూ నవ్వుకోవడం గమనించాను.


ఆ మర్నాడు క్రిష్‌కి అదే చెప్పాను. స్కూళ్లల్లో ఇలాంటివి ఎప్పుడూ జరుగుతూనే ఉంటాయి. ఒకవేళ ప్రిన్సిపాల్ ఆఫీసులో కంప్లైంట్ చేసినా 'లాస్ట్ అండ్ ఫౌండ్' డబ్బాలో వెతకమని చెప్పి పంపేస్తారు.

క్రిష్‌కీ అదే జరిగిందని నాతో చెప్పింది. అలా మాకు పరిచయం పెరిగింది.

మా స్కూల్‌నిండా ఇండియన్సూ, చైనీసూ. వీళ్లూ నాకేసి అదోలానే చూసేవారు.

అవసరం పడితేనే, తప్పనిసరైతేనే మాట్లాడేవారు.





ఇలాంటివి నాకు అలవాటే కనుక అంతగా పట్టించుకునేవాణ్ణి కాదు.

క్రిష్ కూడా మొదట్లో మాట్లాడేది కాదు.

ఒకేరకం అనుభవాలు స్నేహాల్ని బలపరుస్తాయి.

జస్టిన్‌వాళ్లు నన్నూ టార్గెట్ చేసేవారు.

మా అమ్మానాన్నా బోస్టన్ నుండి కాలిఫోర్నియా వచ్చేశారు.

వాళ్లు ఎదుర్కొన్న బాధలూ, కష్టాలూ నాకు తెలుసు.

నిగ్గర్ అంటూ మారుపేర్లతో (నేమ్ కాలింగ్) జస్టిన్‌వాళ్లు నన్నూ వేధించేవారు.

అదొక చేదు అనుభవం!

*

'సాయంత్రం స్టార్‌బక్స్‌లో కలుద్దాం. నీకో గుడ్ న్యూస్...' రెండ్రోజుల తర్వాత క్రిష్ నుండి మెసేజ్!

వస్తూనే ఆనందంగా చెప్పింది- "జస్టిన్ మా ఆఫర్ యాక్సెప్ట్ చేశాడు..." అంటూ. అలా అంటున్నప్పుడు ఆమె కళ్లల్లో మెరుపు స్పష్టంగా కనిపించింది.

మౌనంగా ఉండిపోయాను. ఏం మాట్లాడవేంటని తనే రెట్టించింది.

"మీరిద్దరూ ఎదురుపడినపుడెలా ఉంటుందాని ఆలోచిస్తున్నాను...?"

"ఏముందీ షాక్ తింటాడు... గొంతు చోక్ అవుతుంది..."

"నువ్వు డేంజరస్ గేమ్ ఆడుతున్నావేమో అనిపిస్తోంది క్రిష్...!"

హైస్కూల్‌లో తనెంత నరకం అనుభవించిందో చెప్పడం మొదలుపెట్టింది.

"మాంటావిస్తా హైస్కూలుకి మంచి ర్యాంకు ఉందని ఫ్రీమాంట్ నుండి క్యుపర్టినోకి మకాం మార్చాడు మా డాడ్. నాకైతే సుతారామూ ఇష్టం లేదు. నా ఫ్రెండ్స్ అంతా ఫ్రీమాంట్, ఆర్డన్వుడ్‌వైపే ఉన్నారు. వద్దని ఎంత పోరినా వినలేదు. మా ఇండియన్ కల్చర్‌లో చదువు చాలా ముఖ్యం. మా నాన్న కూడా టిపికల్ ఇండియన్ డాడ్. చదువు... చదువు... అంతే. కొత్త స్కూలు. కొత్త వాతావరణం. మొదట్లో నాకెవరూ ఫ్రెండ్స్ లేరు.

మిగతా అమ్మాయిలకి నేనంటే జెలసీ. గ్రేడ్స్ ఎక్కువ వస్తున్నాయని.

గ్రేడ్స్ బాగా వస్తూండడంతో కాంపిటీషన్, వెరసి ఇంకాస్త జెలసీ.

అమ్మాయిలందరూ పరోక్షంగా మారుపేర్లతో సంబోధించేవారు.

పైగా నేను నల్లగా ఉంటాను. ఉన్న చైనీసూ, అమెరికన్లూ అందరూ తెలుపే.

దానికి తోడు నా పేరు కృష్ణ అవ్వడంతో కృష్ణ అంటే నలుపని ఎవరో టముకేశారు.

దాంతో- నన్ను బ్లాక్ బుక్ అనీ, బ్లాక్ పీసనీ, బ్లాక్ రాక్సీ ఇలా మారుపేర్లతో సతాయించేవారు. వాళ్లల్లో వాళ్లు మాట్లాడుకుంటున్నట్లు నటిస్తూ నన్ను ఏడిపించేవారు.

ఒకసారి 'బ్లాక్ లేబిల్' ఆల్కహాల్ స్టిక్కర్లు నాకు తెలీకుండా నా పుస్తకాల్లో పెట్టారు కూడా. ముఖ్యంగా కెమిస్ట్రీ ల్యాబ్‌లో అయితే భరించలేకపోయేదాన్ని.

వేడి చేసినప్పుడు ఏదైనా ఫ్లాస్క్ మాడిపోతే- 'ఇక్కడున్న ఎవరైనా తాకేరేమో చూడండి... ఐ మీన్ బ్ల్యాక్ హ్యాండ్స్,' అని ఏడిపించేవారు.

నేను పట్టించుకునేదాన్ని కాదు మొదట్లో.

రాను రానూ ఇది ముదరడంతో నాకు తలనొప్పి పెరిగింది.

ఈ బుల్లీయింగ్ తట్టుకోవడం కష్టంగా ఉండేది.

ఎంత పట్టించుకోకూడదనుకున్నా నిమ్మకుండలేకపోయేదాన్ని.

ఇండైరెక్టుగా నన్ను టార్గెట్ చేస్తూ ఫోన్ గ్రూపుల్లో చాట్ పెట్టేవారు.

వీళ్లకి భయపడే నేను 'మై స్పేస్' సైటుకే వెళ్లేదాన్ని కాదు.

సోఫమోర్ గట్టెక్కించాను కానీ, జూనియర్ ఇయర్ వచ్చేసరికి నావల్ల కాలేదు.

జూనియర్ ఇయర్‌లో జస్టిన్ నన్ను టార్గెట్ చేసేవాడు.

నన్ను బుల్లీయింగ్ చేస్తున్నారని ప్రిన్సిపాల్‌కి

కంప్లైంట్ చేస్తే ఒకసారి నువ్వూ నాతోపాటే సపోర్టుగా వచ్చావు, గుర్తుందా?...''

అవునన్నట్లు తలూపాను.

నిజానికి మేం అనుభవించే వివక్ష ముందు మిగతావారివన్నీ చిన్నవిగానే అనిపిస్తాయి నాకు. మా అమ్మానాన్నా ఎన్ని ఎదుర్కొన్నారో ఎప్పుడూ చెబుతూనే ఉంటారు.

బోస్టన్‌లో ఉన్నప్పుడు కొన్ని రెస్టారెంట్లలోకి రానిచ్చేవారు కాదనీ చెప్పేది. ఎదుటివారిని మార్చలేం. మనల్ని మనమే మార్చుకోగలం- అంటూ ఓదార్చేది.

స్కూల్లో జరిగినవి అమ్మకి చెబితే ఒకటే అనేది.

''ఎంత వద్దనుకున్నా అవి గిచ్చుతూనే ఉంటాయి. పట్టించుకోకు. చూసీ చూడనట్లు వది లేయ్. నీ మైండ్‌ని ఊడీ డాల్ చేసుకొని సూదులు గుచ్చుకోకు. ఫోకస్ ఆన్ యువర్ స్టడీస్!''

చదువొక్కటే దాన్ని దాటగలదని నాన్న నూరి పోశాడు.

నిజానికి అదే ఇప్పుడు నాకున్న బలం.

"వాళ్లు నన్నూ టార్గెట్ చేసేవారు, మిడిల్ ఫింగర్ చూపిస్తూ... మగాణ్ణయినా నాకూ ఇవి తప్పేవి కావు... పైకి చెప్పరుకానీ, లోలోపల మన రంగూ, జాతీ కూడా చులకననీ, ద్వేషాన్ని కలిగిస్తాయని లేట్‌గా అర్థమ య్యింది నాకు...'' అంటూ నా గోడు చెప్పుకొచ్చాను.

''ఎగ్జాక్ట్‌లీ... నేనెవర్నీ ఏమీ అనేదాన్నికాదు. అయినా వాళ్లందరూ నన్నెందుకు టార్గెట్ చేస్తున్నారో అర్థమయ్యేది కాదు. స్కూలయ్యి ఇంటికొచ్చినా నన్ను వాళ్లన్న మాటలే దహించేసేవి. దేనిమీదా ఫోకస్ చెయ్యలేకపోయేదాన్ని. ఒకసారి మా అమ్మకి చెబితే- ప్రతీ చిన్నదాన్నీ పట్టించుకోకు. ఫోకస్ ఆన్ స్టడీస్- అంది. నాన్నకి చెప్పినా ఇదే జవాబు.

అందరూ సలహాలిచ్చేవారే. సముదాయించే వారొక్కరూ వుండరు. ఇదొక మానసిక నరకం. రెస్ట్ రూమ్‌కి వెళ్లి ఏడ్చిన రోజులు కూడా వున్నాయి. ఒక్కో సారి చచ్చిపోవాలనిపించేది...''

క్రిష్ సూసైడ్ ప్రయత్నం నాకు తెలుసు. అప్పుడు వాళ్లింటికి వెళ్లి పరామర్శించడం గుర్తొచ్చింది.

"నీకు తెలుసుగా! నన్ను క్రింద పడేసిన ఇన్సి డెంట్! ఆ తరువాత మా అమ్మ జస్టిన్ పేరెంట్స్‌కి వాళ్లింటికెళ్లి కంప్లైంట్ చేసింది. నేను జస్టిన్‌కి మిడిల్ ఫింగర్ చూపించాననీ ఎదురు దబాయించారు. స్కూలు బయట జరిగిన వాటికి స్కూల్ ప్రిన్సిపాల్ బాధ్యత వహించలేమంటారు.

మా నాన్న అమ్మమీద ఎగిరాడు, ఎందుకు వెళ్లా వంటూ? అలా వాళ్లిద్దరి మధ్యా మాటల యుద్ధాలు జరిగేవి. మాటల్లో చెప్పలేని మానసిక క్షోభ.

ఆ సంఘటన నన్ను కుదిపేసింది. లోలోపల కృంగిపోయాను.

మెంటల్ సిక్‌నెస్ ఆవరించింది. నీకు చైనీస్ అమ్మాయి జెస్సికా గుర్తుంది కదా... అప్పుడే- మెల టోనిన్ వేసుకోమని చెప్పింది...

ఒకరోజు రాత్రి విపరీతమైన తలనొప్పి వచ్చింది. రెండు మెలటోనిన్ వేసుకున్నా పనిచేయలేదు. వెంబడే అయిదారు టాబ్లెట్లు.

మెలుకువ వచ్చి చూసేసరికి నేను హాస్పిటల్లో. భయమేసింది. నేను ఎక్కువ టాబ్లెట్లు వేసుకోవడంతో రియాక్షన్ అయ్యిందనీ, ఎమెర్జెన్సీకి తీసుకొచ్చారని మాటల్లో తెలిసింది... దాన్నించి మానసికంగా బయట పడడానికి కొన్ని నెలలు పట్టింది. ఆ తరువాతే లిన్ బ్రూక్ స్కూల్‌కి మార్పించారు మా పేరెంట్స్...!''

ఒక్కసారి చెప్పడం ఆపి కళ్లు మూసుకుంది.

చెంపల మీద జలజలా రాలాయి కన్నీళ్లు.


క్రిష్ సూసైడ్ ఎటెంప్ట్ అని స్కూల్లో విన్నాను గానీ, వివరాలు అంతగా తెలీదు.

అండర్ గ్రాడ్ క్రిష్ బర్కెలీలో చేసింది. నేనూ శాండియేగో వెళిపోయాను.

అలా మా ఇద్దరికీ కట్ అయ్యింది. ఆ తరువాత మరలా కలవలేదు.

యాదృచ్ఛికంగా ఆరేళ్ల క్రితం ఇద్దరమూ సిస్కో లో జాబ్ చెయ్యడంతో మరలా స్నేహం కలిసింది.

"క్రిష్! నీ బాధ అర్థం చేసుకోగలను. ఆవేశంలో జస్టిన్ ఎడల నువ్వు వేరే రకంగా ప్రవర్తిస్తే... యూ నో వాట్ ఐ మీన్... ఇక్కడి చట్టాలు కూడా నీకు



తెలుసు...'' అని చెప్పడానికి ప్రయత్నించాను.

ఆమెలో వినే ధోరణి కనిపించలేదు.

నాకెందుకో భయం వేసింది, అనవసర గొడవల్లో చిక్కుకుంటూందేమోనని.

హైస్కూల్‌లో బుల్లీయింగ్‌కి నేనూ బలయ్యాను.

మనం ప్రపంచాన్ని మార్చలేం. మనల్ని మనం మార్చుకోగలం. అదొక్కటే మన చేతుల్లో వుంది.

వెళ్లబోతూ- "నిజంగా ఈ జస్టిన్ మనతో చదివిన వాడేనా...? ఆర్యూ ష్యూర్...?'' మరోసారి నొక్కి అడిగాను.

"అంతగా అనుమానముంటే జస్టిన్ రెజ్యూమె పంపిస్తాను... చూడు...'' అనేసి వెళ్లిపోయింది.

*

క్రిష్ జస్టిన్ రెజ్యూమె ఈమెయిల్ చేసింది.

ఆశ్చర్యపోయాను. వాడు కంప్యూటర్ సైన్స్‌లో పిహెచ్.డి. వాడి పేర రెండు పేటెంట్లు ఉన్నాయి. ఆశ్చర్యపోయాను.

జస్టిన్ గురించి లింక్డిన్, ఫేస్‌బుక్ ఇవన్నీ సెర్చ్ చేశాను.

ఐ కాంట్ బిలీవిట్...

అతను చాలా సోషల్ సర్వీస్ చేస్తున్నాడు.

ఇదొక్కటే కాదు... స్కూళ్లల్లో బుల్లీయింగ్ థ్రెట్ మీద ఫోన్ యాప్ కూడా చేశాడు.

ఇప్పటి వరకూ మిలియన్ డౌన్‌లోడ్స్ ఉన్నాయి.

బుల్లీయింగ్ మీద ఎన్నో ఆర్టికల్స్ రాశాడు. ఎవరి పేర్లూ ప్రస్తావన లేదుగానీ, తనూ ఒకప్పుడు అలాంటి వాణ్ణేనని... అది తప్పనీ ఆ పోస్టుల సారాంశం.

వెంటనే క్రిష్కి తెలియ చెయ్యాలనిపించింది.

మరలా ఎందుకొచ్చిన గొడవ, ఆ మాత్రం ఆమె గూగుల్ చెయ్యలేదా అనుకొని ఆగిపోయాను.

*

మనిషిని మించిన జటిల జంతువు మరోటి ఉండదు.


ఒకటో రెండు అనుభవాల ద్వారా కొన్నిటిని గాఢంగా నమ్ముతాము.

ఆ భావనకి వ్యతిరేకమైన అనుభవం ఎదురైనప్పుడు అది అంగీకరించడానికి మనసొప్పదు.

రెండ్రోజుల తరువాత అర్జంటుగా కలవాలని స్టార్‌బక్స్‌కి రమ్మనమని క్రిష్ మెసేజ్.

ఏం జరిగిందోనని గాభరాపడుతూ వెళ్లాను.

క్రిష్ చాలా డీలా పడినట్లు కనిపించింది. ఏమయ్యిందో చెప్పలేదుగానీ, నన్ను చూడగానే ఏడ్చింది. బాధపడద్దని సముదాయించాను, విషయం తెలీకపోయినా.



"రాన్! జస్టిన్ మా ఆఫర్ రిజెక్ట్ చేశాడు..." అంది.

"అదేవిటి...? ఇంతకుముందు యాక్సెప్ట్ చేసాడని చెప్పావు కదా...?" ఆశ్చర్యంతో అడిగాను.

"పాత కంపెనీలోనే ఉండాలని నిర్ణయించుకున్నాడనీ చెప్పాడట..."

ఆశ్చర్యపోవడం తప్పించి మాట్లాడలేదు.

"నువ్వుగానీ అతనితో మాట్లాడావా...?" అంది. లేదన్నట్లు తలూపాను.

హ్యాండ్ బ్యాగులోంచి ఒక కాగితం తీసి చూపించింది.

"కృష్ణా!... ఐ కాంట్ స్టాండ్ యిన్ ఫ్రంట్ ఆఫ్ యూ... సారీ...ప్లీజ్ ఎక్స్క్యూజ్ మీ... హార్ట్‌ఫెల్ట్ అపాలజీస్!"

"జస్టిన్ రాసి పంపాడా...?" అడిగాను.

అవునన్నట్లు తలూపుతూ- "నువ్వుగానీ అతన్ని కాంటాక్ట్ చేసావా..." అని అనుమానంగా మళ్లీ అడిగింది. లేదని చెప్పాను.

ఎందుకైనా మంచిదని- "మీ కంపెనీ వెబ్‌సైట్‌లో నీ గురించి చూసుంటాడు..." అన్నాను.

ఆమె కళ్లలో కోపమూ, నిరాశా అన్నీ కొట్టచ్చినట్లు కనిపిస్తున్నాయి.

జస్టిన్ గురించి నేను గూగుల్లో వెతికిన వివరాలు చెప్పాను.

"అతన్ని ఎప్పటికీ క్షమించలేను... నమ్మలేకపోతున్నాను రాన్! నేను వాణ్ణి కలవలేదు... కనీసం ఎదురు కూడా పడకుండా జాగ్రత్తపడ్డాను. మరి ఎలా పసిగట్టాడో... మా కంపెనీ వెబ్‌సైటులో కూడా నా వివరాలు అంతగా ఉండవు..."

"నీ ఎదురుగా నిలబడలేనని అనుకుంటాడు... ఈ మెసేజ్ కూడా అదేకదా...?" అంతకంటే ఏమీ అనబుద్ధి కాలేదు.

"వాడి మీద రివెంజ్ ఎంతో ఎదురుచూశాను... ఐ వాంట్ టూ టీచ్ హిమ్ ఎ లెసన్ ఛ... అరుదైన అవకాశం చేజారిపోయింది," కోపంగా అంది.

"మనం ఊహించుకున్న జస్టిన్ కాదిప్పుడు... బుల్లీయింగ్ మీద ఒక ఫోన్ యాప్ చేశాడు కూడా... మనిషిలో మనం ఊహించని మార్పొచ్చింది..."

"మనుషులంతగా మారుతారంటే నేను నమ్మను రాన్...!"

"క్రిష్! అనవసరంగా ఎక్కువ ఆలోచిస్తున్నావ్..." సముదాయించబోయాను.

"నేనెప్పటికీ వాణ్ణి క్షమించను. ఎంత తుడిచేద్దామన్నా నేను బాధితురాల్ని. అనుభవిస్తే కానీ తీవ్రత తెలీదు..." ఏడుస్తూ అంది.

ఆమె భుజమ్మీద చెయ్యేస్తూ- "నీ బాధ అర్థం చేసుకోగలను. మనిద్దరం హైస్కూల్ దగ్గరే ఆగిపోయాం... త్రో ఎవే యువర్ ఊడూ డాల్," అన్నాను.

నాకేసి తీక్షణంగా చూసింది.

"నువ్వుగానీ జస్టిన్‌తో మాట్లాడావా...?" మరలా రెట్టించి అడిగింది.

లేదన్నట్లు తలాడించాను.

అంతా తన మంచికే జరిగిందనీ మరోసారి సముదాయించడానికి ప్రయత్నించాను.

ఆమె వినే పరిస్థితిలో లేదు.

క్రిష్ బ్యాక్‌ఫైర్ ఎఫెక్ట్‌తో సతమవుతోందనిపించింది.

నమ్మకాలకి వ్యతిరేకంగా సంఘటనలు ఎదురైనప్పుడు ఒప్పుకోలేకపోవడం బ్యాక్‌ఫైర్ సింద్రోమ్ లక్షణం. ఎందుకొచ్చిన గొడవని పైకి మాత్రం అనకుండా నిమ్మకున్నాను.

వెళుతూ నా బ్యాక్‌పాక్ నుండి ఒక బొమ్మ తీసిచ్చాను.

లోపల దూది కుక్కి, గుడ్డతో చేసిన ఒక రంగుల బొమ్మ.

చేత్తో పట్టుకుని అటూ ఇటూ తిప్పి చూసింది.

"ఏంటీ బొమ్మ...? దేనికి...?"

"మొన్న వూడూ డాల్ అంటే తెలీదన్నావు కదా? అదే ఇది. ఇంటికెళ్లి జస్టిన్‌ని తిట్టుకుంటూ తిట్టుకి ఒక సూది గుచ్చు..." అన్నాను.

ఎందుకన్నట్లు మొహం చిట్లించింది.

"వ్యక్తుల ఎడల కోపమూ, ద్వేషమూ అవీ తగ్గుతాయి..." అన్నాను.

కోపంగా నాకేసి చూస్తూ, బొమ్మ టేబిల్ మీద విసిరేసి, విసవిసా నడుచుకుంటూ వెళ్లిపోయింది.

జస్టిన్ జాయిన్ కాకపోవడం క్రిష్‌కే మంచిది.

నిజానికి నేనూ జస్టిన్ విక్టిమ్‌నే. నన్నూ నానా రకాలుగా ఇబ్బందిపెట్టారు. నిగ్గర్ అనేమాట తలచుకున్నప్పుడల్లా నాకూ బాధ కలుగుతుంది. తెలిసీ తెలియని వయసులో అదోరకం శాడిజం. కానీ అది దాటి ముందుకొచ్చేశాను.

అసలు జస్టిన్ గురించి చదివాక నా ఆలోచనా మారింది.

క్రిష్‌కి చెప్పి ఆమె అభిప్రాయం మారుద్దామని ముందు అనుకున్నాను.

అన్నీ తారుమారయ్యాయి- ఆవేశాలూ, అభిప్రాయాలూ, అభినివేశాలూ!

మా అమ్మకి ఫోన్‌చేసి జరిగింది చెప్పాను. నన్ను మెచ్చుకుంది.

ఓ గంట తరువాత ఫోన్ మెసేజ్ వచ్చింది;

"థాంక్యూ రాన్! నన్ను క్షమించినందుకు... నీ స్నేహితుల జాబితాలో చేర్చుకున్నందుకూ... జస్టిన్."




# Race for Crown Jewels



అమెరికాలో పిల్లల పుస్తకాలకి విశేషమైన మార్కెట్ వుంది. ఏటా వేలకొద్దీ పిల్లలపుస్తకాలు అచ్చవుతాయి.

రంగురంగుల బొమ్మలతో ఎంతో ఆకర్షణీయంగా పిల్లల పుస్తకాలు వుంటాయి. కేవలం పిల్లలకే కాక పెద్దలకీ వీటిపై మక్కువే.

అమెరికాలో ఉన్న చాలామంది తెలుగువారు, ముఖ్యంగా రచయితలు తెలుగులోనే రాయడం కద్దు. ఇంగ్లీషులో రచనలు చేసినవారు అరుదు.

ఇండియన్ నేవీలో కమాండర్‌గా పదవీ విరమణ చేసిన కేప్టన్ రామారావు కొంతకాలంగా అమెరికాలోనే ఉంటున్నారు. సముద్రంలో నౌకాయానం చేసిన విశేష అనుభవంతో ఆయన ఎన్నో పుస్తకాలు రచించారు. ముఖ్యంగా పిల్లల పుస్తకాలు.

ఈ మధ్యనే ***Race for Crown Jewels*** అనే పుస్తకాన్ని అమెరికాలో ప్రచురించారు.

ప్రపంచంలో వివిధ దేశాల్లో వున్న విలువైన వజ్రాలతో పొదగబదిన ఆభరణాలు చోరీ అవుతాయి. వీటిని హైటెక్ దొంగలు అపహరిస్తారు. వీటిని పట్టిచ్చిన వారికి వంద బిలియన్ డాలర్లు బహుమతిగా ప్రకటిస్తారు.

ఎమిలీ, అరుణ్, యాండ్రూ అనే ముగ్గురు పిల్లలు ఈ వజ్రాలని తీసుకురావడానికి కొంతమంది మంత్రగత్తెల సాయంతో ఓడ మీద బయల్దేరుతారు. అల్బెట్రాస్ అనే ఒక జలచర పక్షి ఇచ్చే గుర్తులతో అనేక విచిత్ర వ్యూహాలను ఛేదిస్తారు. ఈ ప్రయాణంలో వీరికి ఎగిరే పంది, తెల్ల ఏనుగూ, బుధగ్రహం నుండి వచ్చిన వ్యక్తి ఇలా ఎంతోమంది తారసపడతారు. చివరికి ఈ ముగ్గురూ ఆ దొంగల నుండి వజ్రాలు సంపాదిస్తారా? ఏమవుతుందన్నది పుస్తకం చదివితే తెలుస్తుంది.

ఎంతో సరళమైన భాషతో, ఆసక్తికరంగా సాగిన ఈ రచన పిల్లలనే కాదు, పెద్దల్నీ రంజింపచేస్తుంది. క్రిస్మస్ సందర్భంగా మీ పిల్లలకి అందజేయబోయే గొప్ప Crown Jewel బహుమతి.

ఆలస్యం ఎందుకు?

అమేజాన్‌లో దొరుకుతుంది.

వెంటనే ఆర్డర్ చేయండి!




# ముప్ఫై ఏళ్ల కథాయాత్ర ఒక సాహసం

## కథ 2019 ఆవిష్కరణ

కథ వార్షిక సంకలనానికి ముప్ఫై వసంతాలు...

ఇంతకాలం తెలుగులో నిరాటంకంగా ఒక వార్షిక కథాసంకలనం రావడం అరుదైన సందర్భం. ఈ కోవిడ్ కష్టకాలంలో ఆన్‌లైన్ వేదిక తప్ప అవకాశం లేని సమయంలో దాదాపు రెండు వందలమంది ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుండి కథాభిమానులు వీక్షిస్తుండగా హైదరాబాద్‌లో ముప్ఫై మంది కథాభిమానులు, రచయితల మధ్య కథ 2019 ఆవిష్కరణ జరిగింది.

వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్‌ల సంపాదకత్వంలో వెలువడుతున్న వార్షిక కథాసంకలనాల పరంపరలో ఇది ముప్ఫైవది. తానా ఆర్థిక సహకారంతో ఈ సంకలనాలు అతి తక్కువ ధరకు పాఠకులకు అందుతున్నాయి.


ప్రతి ఏటా ప్రచురితమయ్యే వేలాది తెలుగు కథల్లో అత్యుత్తమమైన వాటిని ఎంపిక చేసి ఒక సంకలనంగా తీసుకురావడం ఒక ప్రయాసతో కూడుకున్న పని అని, అలాంటిది ముప్ఫయ్యేళ్లుగా ఈ యజ్ఞాన్ని నిర్విరామంగా కొనసాగించడం ఒక సాహసం అని సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ కథా రచయిత వి. రాజారామమోహనరావు అన్నారు. ఇన్నేళ్లుగా ఈ సాహసాన్ని కొనసాగిస్తున్న కథాసాహితి సంపాదకులను ఆయన అభినందించారు.

సంపాదకుల్లో ఒకరైన వాసిరెడ్డి నవీన్ సభకు స్వాగతం పలుకుతూ ముప్ఫై ఏళ్ల అలుపెరుగని ప్రయాణాన్ని సంక్షిప్తంగా వివరించారు. ఇన్నేళ్లలో 413 మంది రచయితలు 30 సంకలనాలు 156 మంది కథకులు వెరసి కథాసాహితి సాహసయాత్రగా రూపు



దిద్దుకుంటున్నదని చెప్పారు.

ఈ సందర్భంగా ప్రముఖ కథా రచయిత ఆడెపు లక్ష్మీపతి మాట్లాడుతూ ముప్పయ్యేళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో విమర్శలు కొన్ని తప్పకపోయినా విరామం లేకుండా ప్రచురణలు తీసుకువస్తున్నారని, ఈ కథాసంపుటాలకు మరింత శాశ్వతత్వం దక్కేలా మరికొంత కృషి చేయాల్సిన అవసరం ఉన్నదని సూచనలు చేశారు. కథల ఎంపికలో గెస్ట్ ఎడిటర్లను కూడా తీసుకోవాలని, అలాగే ఇప్పటివరకూ వచ్చిన కథా సంపుటులపై విశ్లేషణాత్మక వ్యాసాలతో ఒక పుస్తకాన్ని ప్రచురిస్తే బాగుంటుందని సూచించారు. అలాగే ఇప్పటివరకూ వచ్చిన సంకలనాలలో మంచి కథలను ఎంపిక చేసి వాటిని ఇంగ్లీషు భాషలోకి




కూడా తర్జుమా చేస్తే, తెలుగు భాషా రచయితల గురించి ప్రపంచ భాషాభిమానులకు కూడా తెలిసే అవకాశం వుంటుందని సూచించారు.

ఈ మూడు దశాబ్దాల్లో కథ సంపుటాలు తీసుకు రావడంలో తెరవెనుక వ్యక్తులుగా ఉన్నటు వంటి అక్షర సీత, పరుచూరి సుబ్బయ్యలు కథ-2019ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా అమెరికా నుంచి తానా పూర్వ అధ్యక్షులు జంపాల చౌదరి జూమ్ కాల్ ద్వారా మాట్లాడుతూ తాను 1999 నుండి ఈ కథాసంపుటి విషయంలో సహకరిస్తున్నా, కార్యక్రమంలో పాల్గొనడం అనేది తనకు ఇది రెండవసారి అని అన్నారు. అలాగే ఈ పుస్తక సంకలనం వల్ల ఒక ఏడాదిలో వచ్చిన మంచి కథలను ఒకేచోట చూడడం వీలవుతుందని, ఈ పరంపర ఇలాగే కొనసాగాలనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

తానా ప్రచురణల కమిటీ అధ్యక్షులు కన్నెగంటి చంద్ర మాట్లాడుతూ నిజానికి ఒక ఏడాదిలో వచ్చిన అన్ని కథలను చదివి, వాటిలో మంచి వాటిని ఎంపిక చేయడం అనేది ఎంతో ఓపికతో కూడుకున్న పని అని, అలాంటిది నవీన్, పాపినేని శివశంకర్‌లు ప్రతి ఏడాది ఈ పనిని ఎంతో ఓర్పుగా చేస్తూ గత ముప్పై ఏళ్లుగా కథాసంపుటులను తీసుకువస్తున్నారని ఆయన అన్నారు.

ప్రముఖ కథా రచయిత, సాహితీ సమీక్షకులు దాసరి అమరేంద్ర ఈ సంకలనంలోని కథలను సమీక్షించారు. విలక్షణమైన నేపథ్యాలను ఎంచుకుని తెలుగులో మంచి కథలు వస్తున్నాయని ఆయన అభినందించారు.



శివశంకర్‌లాగా పుస్తక సంపుటి తీసుకురావడానికి పలువురు ప్రయత్నించారని, అయితే ఇలా నిరాటంకంగా ముప్పై ఏళ్లపాటు పుస్తక సంకలనం తీసుకు రావడం ఎవరికీ సాధ్యం కాలేదని అన్నారు.

కథ 2019 సంపాదకుల్లో ఒకరైన పాపినేని శివశంకర్ జూమ్‌లో మాట్లాడుతూ కథాసాహితి అంటే తాను, వాసిరెడ్డి నవీన్ మాత్రమే కాదని, దీని వెనుక ఎందరో ఉన్నారని, వారి కృషి దాగి వుందని, అలాగే ప్రతి ఏడాది తమను ఆదరిస్తున్న పాఠకులు కూడా దీని వెనుక ఉన్నారని అన్నారు.

అనంతరం కథాసంపుటిలో ఎంపికైన కథల రచయితలు తమ కథల నేపథ్యాన్ని, అనుభవాలను ఈ సందర్భంగా అందరికీ తెలియజెప్పారు. వీరిలో కొందరు ప్రత్యక్షంగాను, కొందరు ఆన్‌లైన్ ద్వారాను పాల్గొన్నారు.

కథ



# తెల్ల కాగితం

దీప్తి పెండ్యాల

"మామ్, నేను సాయంత్రం వరకల్లా వస్తాను, గుర్తుందిగా. రెండింటికే డాక్టర్ అపాయింట్మెంట్.  ఈ రోజు అపాయింట్మెంట్ కి నిన్ను మిస్టర్ సాక్స్ తీసుకెళతానన్నాడు. జాగ్రత్తగా వెళ్లిరా. సరేనా?" మామ్ కి జాగ్రత్తలు చెబుతూనే ఇంట్లోంచి బయటకు వచ్చాను. మామ్ కి రెండువారాల క్రితం కుడి కాలు ఫ్రాక్చర్ అయింది. ఇంకొన్ని వారాలు డ్రైవ్ చేయలేదు. డాడ్ కూడా ఊర్లో లేకపోవటంతో మా ఇంటికి దగ్గర్లో ఉండే బంధువు మిస్టర్.సాక్స్ సాయం కోరాను.





దీప్తి పెండ్యాల మధురవాణి అంతర్జాల పత్రిక సంపాదకులలో ఒకరు. వీరు కథలు రాయడంతోపాటు మధురవాణిలో ముచ్చట్లు శీర్షిక నిర్వహిస్తుంటారు. నివాసం హ్యూస్టన్.

"హాయ్ ఆండ్రూ!" వారాంతం శెలవుమీద వచ్చి, కాలేజీకి తిరిగి బయల్దేరుతున్నదల్లా ఆగి మరీ ఉత్సాహంగా నన్ను పలకరించింది పక్కింటి స్నేహితురాలు అంజలి.

నాకు వినబడింది. స్పష్టంగా. కానీ బదులు చెప్పాలనిపించలేదు. వినబడనట్టే తిరిగి లోపలికెళ్లిపోయాను.

"ఏమయింది? ఏదయినా మర్చిపోయావా?" నన్నే చిత్రంగా చూస్తూ అడిగింది మామ్.

మెడలో వేలాడుతున్న 'డేవిడ్ బ్రదర్స్ పెస్ట్ కంట్రోల్ కంపెనీ' ఐ.డి.కార్డు, చేతిలో ఉన్న కంపెనీ బ్యాగ్‌కేసి చూసుకున్నాను. ఆలస్యం సహించని బాస్ డేవిడ్ గుర్తొచ్చాడు. అయినా అంజలితో మాట్లాడటం తప్పితే చాలనిపించింది ఆ క్షణం.

బ్యాగ్‌ని ఓ మూల పెడుతూ వచ్చి రిక్లయినర్‌లో కూలబడ్డాను.

"వెళ్లినట్టే, వెళ్లి వెనక్కి వచ్చావేంటీ?" మామ్ మళ్లీ అడిగింది.

"ఏమీ లేదు, ఆ పక్కింటి దయ్యం..." మాటలు పూర్తిచేయలేక అర్థోక్తిలో ఆగిపోయాను.

మామ్ నా గొంతులో ధ్వనించిన కోపాన్ని గమనించి, నమ్మలేనట్టుగా చూసింది నా వైపు. "అదేంటి? ఏంజెల్‌పై కోపమెందుకూ? చిన్ననాటి నుంచీ మనింట్లో పెరిగినట్టు పెరిగిన పిల్ల. ఎపుడూ ఇద్దరూ కలిసే ఆడేవారు కదా? గత సంవత్సరం నుంచీ ఏంజెల్‌ని చూసిందేలేదు. పాపం ఈ వారాంతం వచ్చినప్పటినుంచీ నీ కోసం ఎన్నిసార్లడిగిందో? ఎందుకిలా ఏంజెల్‌ని తప్పించుకు తిరుగుతున్నావు?"

"ఏంజెల్ కాదు. అంజలి తన పేరు. అంజలి అనే పిలవాలని ఎన్నిసార్లు చెప్పాలి? పిలవకపోతే దయ్యం అని పిలువు. అదయితే సరిగ్గా సరిపోతుంది," విసుక్కుంటూనే అన్నాను గొణుగుతున్నట్టుగా. నాకే తెలియని అసహనం నాలో.

మామ్ దీర్ఘంగా ఏదో ఆలోచిస్తూ నన్నే చూస్తుంటే, ఆ పరిస్థితి కలిగించిన ఇబ్బందివల్ల కొంతా, మరీ ఆలస్యమైతే బాస్ ఈ పార్ట్‌టైం ఉద్యోగం నుంచీ తీసేస్తాడన్న భయంతో కొంతా... లేచి బ్యాగ్ తీసుకుని, కిటికీ కాస్త తెరిచి బయటకు చూశాను.

ఎవరూ లేరని నిర్ధారించుకుని, నావైపే సాలోచనగా చూస్తున్న మామ్‌కి బై చెప్పేసి బయల్దేరాను.

వెనుక నుంచి మామ్ మాటలు వినబడ్డాయి- "ఆండ్రూ, ఈరోజు మిస్టర్ సాక్స్ రానవసరం లేదు. నా అపాయింట్‌మెంట్ వాయిదా వేస్తున్నానని చెప్పు."

ఆ మాటలు విన్న నేను ఆశ్చర్యపోలేదు. మామ్ ఇకపై మిస్టర్ సాక్స్‌ని వీలయినంత దూరముంచే అవకాశముందని నాకు ఇందాకే అర్థమయింది.

కార్ నడుపుతున్నానన్న ధ్యాసేకానీ, చిన్నబోయిన మామ్ మొహం గుర్తొస్తుంది. మామ్‌కి అంజలి అంటే చాలా ఇష్టం. అంజలి అనేకాదు, మామ్‌కి మనుషులంటే ఇష్టం. నాకూ అంజలి మంచి స్నేహితురాలుగా తోచేది.

ఒక్కసారి హైస్కూల్‌లోకి వచ్చాక, ఇద్దరి దారులూ వేరవటం మొదలయింది.

హైస్కూల్ రంగుల ప్రపంచం. నాకు మొదటి నుంచీ ఇష్టమైన బ్యాండ్‌లో చేరాను. అక్కడ కొత్త స్నేహాలు పగలనకా, రాత్రనకా మా ప్రాక్టీసులు, అదే లోకంగా జీవితం. చదువుపై ఆసక్తి తగ్గింది. బ్యాండ్ వరకే నా ఆసక్తి పెరిగి ఉంటే బావుండేది. ఆ తర్వాత నా ఆసక్తులు కొత్త అలవాట్లు, వాటి ఆకర్షణావలయాలని అల్లుకుంటూ వెళ్లాయి. సీనియర్ యియర్-పన్నెండో తరగతి వచ్చాక మాత్రమే నేను వాస్తవాన్ని గుర్తించాను. కాలేజీ చదువులకి నేను సిద్ధంగా లేననీ, నాలుగేళ్ల పాటు చదివి డిగ్రీ తీసుకోగల ఆసక్తీ లేదని నాకు అనిపించింది. అదే సమయంలో అంజలి కష్టం ఫలించి, తను కోరుకున్న ఐవీ కాలేజీలో సీటు రావటంతో రెక్కలు కట్టుకుని మరీ అక్కడ వాలిపోయింది.

తెలీకుండానే దూరం పెరిగింది కానీ, కనబడినపుడు స్నేహంగానే మాట్లాడుకున్నాము. ఎటొచ్చీ, ఈ మధ్యే నా దారి వేరవటంకాదు, మొదటినుంచీ మేము వేరు వేరు అనే అనిపిస్తుంది. ఈ మార్పుకి కొంతవరకూ నాకు నేను కారణమయితే, మరికొంత మిస్టర్ సాక్స్ కారణమయుండాలి. మిస్టర్ సాక్స్ మా డాడ్‌కి కజిన్

వరుస. మా ఊరికి ఈమధ్యే బదిలీపై వచ్చాడు. తరచుగా ఇంటికి వస్తూంటాడు. అంతకుముందు అతనున్న కంట్రీసైడ్ ప్రాంతంలో ఇతర దేశీయులెవరూ లేకపోవటంతో, అతనికి ఈ మహానగరం నిండా విస్తరించి ఉన్న ఇతర జాతులని చూస్తుంటే అసహనం కాబోలు. నొసలు ముడి వేస్తూంటాడు. మా వీధిలో ఉన్న ఇతర దేశాల వారి ఉనికిని చూపులతోనే నిరసిస్తూంటాడనిపిస్తుంది. మన దేశానికి వచ్చి, వాళ్లు సంపన్నులవుతున్నారని మాత్రం అపుడపుడూ గొణుగుతాడు. ఓరోజు నాకు బాగా గుర్తు. అక్కడి నుంచి ఇల్లు మారమని, కకేషియన్స్ మాత్రమే ఉన్న కమ్యూనిటీలో ఇల్లు తీసుకొమ్మనీ మామ్‌తో అన్నాడు. ఆ మాట వినీ నేనూ ఆశ్చర్యపోయాను. మామ్‌కి ఎందుకో మిస్టర్ సాక్స్ పై పెద్ద మంచీ, చెడూ అంటూ ఏ అభిప్రాయం ఉండకపోయేది కానీ, ఆరోజు మాత్రం, 'నాకిక్కడంతా బాగుంది. నాకిలాగే బాగుంది' అని నిక్కచ్చిగా అంది. ఆపై ఆ ప్రస్తావన మామ్ ముందెపుడూ తేలేదిక. కానీ, నేను మిస్టర్ సాక్స్ మాటలు శ్రద్ధగా వినటం మొదలుపెట్టాను. అప్పుడు మొదలయిందనుకుంటా. చిన్నప్పుడు తెలీని తేడాలు స్పష్టంగా కనబడటం. మిస్టర్ సాక్స్ అభిప్రాయాలు వింటూంటే మాత్రం వారు వేరు, పరాయివారు అన్న స్పృహ గట్టిగా కలగటం మొదలయింది. తర్వాత ఎందుకో మా ఇద్దరి పద్ధతులు, ఆసక్తులూ వేరు వేరు అన్న స్పృహ కలుగుతూండటంతో అంజలితో స్నేహం పట్ల ఆసక్తి కలిగేదికాదు. తరచి చూస్తే నా ఇతర కకేషియన్ స్నేహితులెవరూ నాలా ఈ అయిష్టత చూపట్లేదు. నేను నాకు తెలీకుండానే మిస్టర్ సాక్స్‌లా మారుతున్నట్టు తెలిసేది కానీ అదేమీ తప్పనిపించలేదు.

కట్ చేస్తే- మళ్లీ బ్యాండ్ పై దృష్టిపెట్టాను. కమ్యూనిటీ కాలేజీలో చేరాను. డేవిడ్ ఇచ్చిన వీకెండ్ జాబ్ చేస్తున్నాను. నిజం చెప్పాలంటే నా పట్ల నాకేమీ రిగ్రెట్స్ లేవు. నేనెలా ఉండాలనుకున్నానో అలాగే ఉన్నాను. కానీ, అంజలి విభిన్నంగా ఉన్నందుకు నచ్చట్లేదు. తను తనలా ఉంది. నాలా లేదు. అదీ నచ్చట్లేదు. ఈ లోకంలో మనుషులందరూ మూస పోసినట్టు నాలా ఉండాలని నేను కోరుకోను కానీ, నాకంటే పూర్తి భిన్నంగా ఉండటం బహుశా నాకు నచ్చట్లేదేమో. అందుకే మిస్టర్ సాక్స్ మాటలలో నాకు నేను ఐడెంటిఫై చేసుకుంటున్నానేమో.


నేను 'చేరవలిసిన ఇల్లు వచ్చింద'ని నా కార్‌లోని జీ.పీ.ఎస్ చెప్పటంతో ఆలోచనల్లోంచి బయటకి వచ్చాను.

సరిగ్గా పార్క్ చేయగానే, డేవిడ్ నుంచి మెసేజ్. 'ఆండ్రూ, నువ్వు సర్వీస్ చేయాల్సిన మిస్టర్ తోట ఇంటికి చేరావు కదా,' అని. అప్పుడు గమనించాను. పనివేళలు మొదలు కాగానే, నేను నా ఫోన్‌లో ఉన్న జియో ట్రాకింగ్ యాప్ ఆన్ చేయలేదని. అంజలి కనబడటంతో మరేవో ఆలోచనల్లో పడి ఈ విషయమే మర్చిపోయానని.

వెంటనే సమాధానం పంపాను- 'చేరాన'ని. ఇతని సమయపాలన, వృత్తిపట్ల అంకితభావం నాకు కొత్తకాదు. ఏ తేడాలూ ఒప్పుకోడు. పొరపాట్లూ సహించడు. అందుకే ఈ ఊరిలో అతని సర్వీసెస్‌కి మంచి పేరుంది. ఉద్యోగుల అజాగ్రత్త పట్ల అతనికి జీరో టాలరెన్స్.

వెంటనే ఫోన్‌లో ట్రాకింగ్ యాప్ కూడా ఆన్ చేసాకే, ఆ ఇంటి తలుపు తట్టాను.

ఒక ఐదు నిమిషాల తర్వాత చెవికి హెడ్ సెట్ పెట్టుకుని, తలుపు తీసింది ఒకావిడ. తలుపు తీసీ, తీయగానే, 'ఎక్స్క్యూజ్‌మీ అని' కంప్యూటర్ దగ్గరికెళ్లి, ఏదో చెప్పి, తిరిగి నా దగ్గరికి వచ్చింది. బహుశా ఏదో



మీటింగ్‌లో ఉన్నట్టుంది.

ఒక పాత టీ-షర్ట్, వెలిసిపోయిన పజామా, గోధుమ వర్ణం, నుదుటిపై చిన్న టాటూ, దాన్ని బొట్టు అంటారని అంజలి చెబుతుంది, కానీ, నేను టాటూ అనే అంటాను. మొహాన చిరునవ్వు అంటించుకుని వచ్చింది. వెరసి, మళ్లీ ఇక్కడా ఓ ఇండియన్ వుమన్. ఐ జస్ట్ హేట్ దెమ్, యూ నో?

"షూస్ బయటే వదలగలవా?" అభ్యర్థనగా అడిగింది. మాకు అలవాటే. ఈ ఇండియన్ వుమెన్ ప్రేయర్ రూంలోకి చెప్పులు వేసుకుని రాకూడదంటారు. కొందరు ఇళ్లలోకే వద్దంటారు. అలాంటప్పుడు షూస్‌కి వేసుకోవటానికి కొన్ని తొడుగులు ఇస్తాడు డేవిడ్. అవి వేసుకున్నాను.

ఆవిడ నా కాళ్లవైపు కొంచెం నిరాశగా చూసి, వెంటనే సర్దుకుంది. మొహంపైకి చిరునవ్వు తెచ్చిపెట్టుకుంది. ప్రేయర్ రూంలోకి మాత్రం వెళ్లవద్దని చెప్పి, ఇల్లు చూపించింది, ఎక్కడెక్కడ పెస్ట్ కంట్రోల్ కోసమని, బొద్దింకలు వగైరాలు రాకుండా జెల్ బెయిట్ పెట్టాలో వివరిస్తుంది, నాకు తెలీనట్టు. నేనేదో ఈ పనికి కొత్తయినట్టు. సర్వీస్‌కి వచ్చిన ప్రతీసారీ ఏమి చేయనున్నానో చెప్పాల్సిన పని నాది. కానీ, ఒక్కోసారి వింటూ ఉండటంలో సౌలభ్యం ఒకటుంది. అదేంటంటే... ఆవిడ మాట్లాడుతూ ఉంటే, నేను మాట్లాడనవసరం లేదు. అందుకు. నాకిష్టం కాని వ్యక్తులతో మాట్లాడ్డం నాకు పెద్దగా ఇష్టముండట్లేదు. ఆవిడంటే ఎందుకు ఇష్టంలేదని మీరు అడిగితే- మళ్లీ మొదటి కొస్తున్నారు మీరు అంటాన్నేను. అదంతే. అంజలి ఎందుకు నచ్చదో అందుకే. సరే, మొత్తానికి అలా ఆ ఇల్లుని ఎలా క్రిమికీటకాలకి స్థానంలేని భద్రతా స్థావరంగా మార్చాలో వివరించింది. మొహం మీది నవ్వు ఏ మాత్రం తగ్గకుండా. ఎందుకలా నవ్వుతూ ఉంటారో? నా మొహం మీద అయిష్టత కనబడకా? లేక, నాలాంటి వారి మొహాలపై కదలాడే అయిష్టతలకి అలవాటు పడా?

ఆవిడ చెప్పిన చోట్లన్నీ షీట్ మీద మార్క్ చేసుకున్నాను. అసలు, ఇల్లు అంటారా దాన్ని. మేన్షన్. ఎంత పెద్ద భవంతో. ఎంతో అందంగానూ తీర్చిదిద్దబడి ఉంది. ఇల్లు నచ్చింది. కానీ, ఆ ఇంటికి ఆవిడ యజమానురాలు అవటం నచ్చలేదు. ఎందుకంటే, అలాంటి అందమైన ఇళ్లకి యజమానులుగా ఎవరుండాలనే దానిపట్ల నాకు కొన్ని నిశ్చితాభిప్రాయాలు ఏర్పడుతున్నాయి మరి. ఎంతో గంభీరంగా ఎలిజబెత్ రాణిలా మెరిసిపోతూ ఉండే మా గ్రానీ గుర్తొచ్చింది. ఇలాంటి వాటికి అలాంటి యజమానురాలే ఉంటే బాగుండదూ? మా మామ్, చెల్లెళ్లులాంటివాళ్లు తిరుగాడితే కదూ ఈ భవంతికి అందమొచ్చేది?

నాకు అప్పజెప్పి వెళ్తున్నదల్లా మళ్లీ వచ్చింది.

పని చేసుకోకుండా ఏంటీవిడా?

"అడగటం మర్చిపోయాను. మంచినీళ్లేమయినా కావాలా?" ఓపెన్ చెయ్యని వాటర్ బాటిల్ ఆఫర్ చేస్తూ ఆదరంగా అడిగింది.

"నో, అయాం ఫైన్," అన్నాను. ముఖం అలాగే గంటుగా పెట్టుకుని.

అన్ని గదుల్లోనూ స్ప్రే చేయటం, జెల్ బెయిట్ పెట్టటం అంతా అయిపోయింది. హాల్‌లో ఉన్న నాలుగేళ్ల పిల్లాడు తెల్ల కాగితం మీద ఏదో రాసుకుంటున్నాడు. పక్కన పెన్సిళ్లు, క్రేయాన్లూ... మధ్య మధ్య నా వంక చూస్తూ స్నేహపూర్వకంగా నవ్వుతున్నాడు. నన్నేదో రకంగా ఆకట్టుకోవాలని కాబోలు. కాగితం పై ఏదో చూపుతున్నాడు. వాళ్లమ్మని చూసినంత నిర్లక్ష్యంగా వాడినీ చూశాను. అయినా వదలడే.

చివరి అంకంగా కిచెన్ క్యాబినెట్స్ ఓపెన్ చేసి, మూలలలో జెల్ బెయిట్ పెడుతూన్నప్పుడు జరిగిందది. పని పూర్తిచేసి వెళ్లిపోయే తొందరలో ఉన్నానేమో, ఒక క్యాబినెట్ డోర్‌ని ఠక్కున వేసేశాను. ఆ వేయటంలో విసురుకి దానిపైన షెల్ఫ్‌లో స్టాకప్ అయి ఉన్న గాజుగ్లాసులన్నీ ఒక్కసారిగా కిందపడ్డాయి. భళ్లున పగిలాయి, పెద్ద శబ్దం చేస్తూ.

క్షణంలో జరిగింది ఈ భీభత్సమంతా.

ఆ శబ్దం విని భయపడ్డ పిల్లాడు గట్టిగా వాళ్లమ్మని కేకేశాడు. ఆలోపే, ఆ శబ్దం వినబడిందేమో, పరుగు పరుగున వచ్చేసి వాణ్ణి గట్టిగా పట్టుకుంది. నా ముందంతా కిచెన్ నుండి డైనింగ్ ఏరియా వరకూ చెల్లాచెదురుగా, పెద్దా చిన్నా పరిణామాల్లో, పదునుగా

కొనదేలి పడున్న గాజుముక్కలు. ఎదురుగా ఇందా కటి వరకూ నేను నిర్లక్ష్యంగా చూసిన తల్లీ, పిల్లాడు.

ఒక్కసారిగా కళ్ల ముందు అజాగ్రత్తని క్షమించని డేవిడ్ కనబడ్డాడు. ఇపుడు ఈవిడ ఇచ్చే ఫీడ్ బ్యాక్ చాలు అతనికి. నన్ను ఫైర్ చేసేందుకు. మరో ఉద్యోగం వెదుక్కొనేందుకు పట్టే సమయం, ఆలోపు నాకున్న అవసరాలు అన్నీ కళ్ల ముందు నిలిచాయి. ఇంతవరకూ మనసున తిష్ట వేసుకునున్న అసహ నాలు, చిరాకులు అన్నీ మాయమయ్యాయి. భయం, బెంగ, దిగులు ఆక్రమించుకున్నాయి.

పిల్లాడిని ఇటువైపు రావొద్దని చెప్పి వాడిని హై చెయిర్‌లో కట్టేసింది. వాడు అంత గందరగోళంలోనూ ఆ కాగితం మాత్రం వదలకుండా గట్టిగా చేతిలోనే పట్టుకుని ఉన్నాడు. కిచెన్ దగ్గరగా వస్తున్న ఆమెకు సంజాయిషీ ఈయబోయాను- "సారీ... సారీ..." అంత కంటే ఏమి చెప్పాలో తెలియట్లేదు.

"ఇట్స్ ఓకే. ఇట్ హ్యాపెన్స్," అంది. కాకపోతే మొహంలో ఇందాకటి నవ్వు లేదు. అలాగని కోపమూ లేదు.

ఆ మాట ఊహించలేదు నేను. ఇపుడిలా అని, తర్వాత డేవిడ్‌కి చెప్పి రిఫండ్ చేయమంటుందేమో?

"సారీ. నేను క్లీన్ చేస్తాను..."

నా మాట పూర్తి కాకముందే అంది. "ఫర్లేదు. నేను చేస్తాను," అంటూ చకచకా వెళ్లి గ్లవ్స్ వేసుకుని, ఫ్లోర్ బ్రష్‌తో ఆ గాజుముక్కలన్నీ ఒక దగ్గరగా ప్రోగు చేసేందుకు సిద్ధమయింది.

తర్వాత నేనేమి చెయ్యాలో అర్థమవక అక్కడే నిల్చుండిపోయాను. ఇది జరుగకుండా ఉండుంటే, ఈపాటికి బయటకి వెళ్లుండేవాడిని.

కళ్లముందు కనబడుతున్న అంత పనిలోనూ నన్నూ, నా అవస్థను గమనించిందేమో, "అన్ని గదులూ పూర్తయ్యాయా?" అంది.

అవునన్నట్టుగా తలూపాను.

"సరే, అయితే. థ్యాంక్యూ," అనేసి, సిద్ధంగా ఉన్న చెక్ ఇచ్చింది. నేను ఫీడ్-బ్యాక్ పత్రం ఇచ్చి, కార్ వద్దకు వెళ్లాను. రశీదు తెచ్చివ్వటానికి.

ఆవిడకి రశీదు ఇచ్చి, ఆవిడ నింపిన ఫీడ్ బ్యాక్ పత్రం చేతుల్లోకి తీసుకుని క్షణాల్లో పై నుంచి కిందికి చదివేశాను. నా ఘనకార్యం గురించి ఏదయినా రాసిం దేమోనని? ఆ పత్రంలో అన్ని ప్రశ్నలకీ ఆమె నుంచి ఒకే సమాధానం- 'గుడ్.' హమ్మయ్య! ఒక్కసారిగా మనసు తేలికయింది.

"థ్యాంక్యూ," అని చెప్పి బయటకు వస్తుంటే పిల్లాడు నాకేసి చూసి మళ్లీ నవ్వాడు. ఈసారి నాకు వాడిపై ఏ చిరాకూ రాలేదు. పైగా నేనూ నవ్వాను, కాస్త గిల్టీగా. వాడు నాకు వాడి చేతిలో ఉన్న కాగితం అందించబోయాడు. ఇందాకటి నుంచీ వాడి చేతిలోనే ఉన్న కాగితం అది. అందుకుని దాన్ని చూడగానే ఆశ్చర్యపోయాను. వాడు గీసింది నన్నే. అంతకు ముందు నేను పని చేసుకున్నంతసేపూ నావైపు చూస్తూ వాడు కాగితం మీద గీసింది నా బొమ్మేనన్నమాట. అది సరిగ్గా నా చిత్రమే. 'కోపంగా ఉన్న నేను.' అంతే. అందులో నేను గొప్పదనుకున్న నా జాతి వర్ణాన్ని వాడెక్కడా అద్దలేదు. వాడికి కనబడిందల్లా నా కోపం, అసహనం. అంతే. బహుశా అంజలికీ, ప్రస్తుతం కన బడుతున్న నా రూపం ఇదే కావచ్చు? మామ్‌కి కనబడ్డ రూపమూ ఇదేనా? అందుకేనా అంత బాధగా కన బడింది? మరొక్కసారి ఆ బొమ్మ వైపు చూశాను, కోపంగా వికృతంగా ఉన్నాను. నా చేతిలో ఉన్నది తేలికయిన కాగితమే కానీ, మోయలేనంత బరువుగా ఉంది. ఆ కాగితం తీసుకుని- వాడికి థాంక్స్ చెప్పి బయటకి నడిచాను.

వెళుతున్నవాడినల్లా మరొక్కసారి ఆవిడ వైపు చూశాను. పాత టీ-షర్ట్, వెలిసిపోయిన పజామా, అదే గోధుమ వర్ణం శరీరం, పైగా ఇపుడు దానితోపాటే చేతిలో చీపురు. అదే రూపం. నుదుటన అదే బొట్టు. కానీ, ఇప్పుడు దాన్ని టాటూ అనాలనిపించటం లేదు.

"Patriotism can flourish only where racism and nationalism are given no quarter. A patriot is one who loves his homeland. A nationalist is one who scorns the homelands of others."

*-Johannes Rau*

మధురవాణి అంతర్జాల పత్రిక సౌజన్యంతో

# Enjoy Araku Boomi Instant Coffee

- **Arabica Beans from Araku Valley**
- **Award Winning Beans**
- **Quality Highly Ranked by Specialty Coffee Association**
- **No Chicory. 100% Pure Coffee**
- **Tastes like Filter Coffee**

**Available at your local Indian stores.**

araku boomi instant coffee






wecare@boomicoffee.com
boomicoffee.com

శ్రీ అట్లూరి & జలపతి

# మీటర్ తిరుగుతోంది...

ఒకవైపు కరోనా సంక్షోభం. మరో వైపు సినిమా థియేటర్ల వ్యాపారం భవిష్యత్‌లో ఎలా ఉంటుందో తెలియని అయోమయం. ఇంత అనిశ్చితిలో కూడా హీరోల పారితోషికాలు తగ్గలేదు. ఇంకా చెప్పాలంటే పెరిగాయి. 40 కోట్లు తీసుకునే హీరో 60కి పెంచాడు. 60 కోట్లు తీసుకునే హీరో 80కి మీటర్ తిప్పాడు. దానికితోడు, మొన్నటి వరకు ఏడాదికో సినిమా ప్రకటించిన హీరోలు ఇప్పుడు ఒకేసారి మూడు, నాలుగు సినిమాలు అనౌన్స్ చేస్తున్నారు. దానికి తగ్గట్లే నిర్మాతల నుంచి అడ్వాన్సు కూడా పొందుతున్నారు. అంటే ఒక్కో బడా హీరో సగటున ఏడాదికి 100 కోట్లు లాగేసుకుని పనిలో ఉన్నారన్నమాట.



ప్రభాస్ - ఆదాయం 300 కోట్లు
ఆదిపురుష్
సాలార్
నాగ్ అశ్విన్ మూవీ
రాధేశ్యామ్ (సెట్స్ పై ఉంది)

## ఎర్నింగ్‌లో టాప్ హీరో ప్రభాస్

ప్రభాస్ మరీ లేజీ అని ఆయన ఫ్యాన్స్ ముద్దుగా తిట్టుకునేవారు మొన్నటివరకు. ఎందుకంటే... ఒక్కో సినిమాకి రెండేళ్లు, మూడేళ్లు తీసుకునేవాడు. అలాంటి హీరో ఇప్పుడు ఏకంగా మూడు కొత్త సినిమాలు లైన్‌లో పెట్టాడు. గ్యాప్ తీసుకోకుండా నటిస్తాడు ఇక.

ప్రస్తుతం సెట్ మీదున్న రాధే శ్యామ్ కాకుండా సాలార్, ఆదిపురుష్, సైన్స్ ఫిక్షన్ మూవీస్ 2021లో షూటింగ్ జరుపుకుంటాయి. ఈ మూడు సినిమాలకు కలిపి 250 కోట్లు తీసుకుంటున్నాడు ప్రభాస్. ఒక్కో సినిమాకి 75-80 కోట్ల పారితోషికం. రాధేశ్యామ్ సొంత బ్యానర్ మూవీ కాబట్టి దానికి 50 కోట్లుగా ఆయన పారితోషికం వేసుకోవచ్చు. అంటే అక్షరాలా 300 కోట్ల పారితోషికం రూపంలో ప్రభాస్‌కి ముడుతుంది. 2022నాటికి ఈ సినిమాలన్నీ పూర్తవుతాయి. అంటే ఏడాదికి 150 కోట్ల సంపాదన.

ఈ మూడు వందల కోట్ల రూపాయల్లో ఇప్పటికే కొంత అడ్వాన్స్ రూపంలో ప్రభాస్‌కి అందింది. పారితోషికంతో పాటు ప్రభాస్‌కి అదనపు ఖర్చు కూడా ఎక్కువ. స్పెషల్ ఫ్లైట్స్, లక్సరీ హోటల్ రూమ్స్, ఎక్సోటిక్ లొకేషన్‌లో షూటింగ్స్... ఇలా బోలెడంత ఖర్చు ఉంటుంది. ప్రభాస్‌తో సినిమా అంటే... 250 నుంచి 300 కోట్ల రూపాయలు నిర్మాత రెడీ చేసుకోవాల్సిందే. ప్రస్తుతం


పాపులారిటీలోనూ, సంపాదనలోనూ ప్రభాస్ నంబర్ వన్.

విచిత్రం ఏమిటంటే.. ప్రభాస్ ఒప్పుకున్న ఈ మూడు భారీ సినిమాలు కూడా కరోనా సంక్షోభం కొన సాగుతున్న ప్రస్తుత టైంలోనే. ప్రభాస్ సినిమా ఎప్పు డొచ్చినా జనం థియేటర్‌కి వస్తారు అన్న నమ్మకంతో నిర్మాతలు అంత మొత్తం ఇచ్చేందుకు రెడీ అయ్యారు.

## పవన్ కళ్యాణ్ వాటా 200 కోట్లు

నిజానికి పవన్ కళ్యాణ్ సినిమా ఏదీ ప్రభాస్‌లా 200 కోట్లు, మూడు వందల కోట్ల రూపాయల వసూళ్లు ఇంతవరకు సాధించలేదు. రెండేళ్లుగా ఆయన సినిమాలకు దూరంగా ఉన్నాడు. ఫుల్ టైం రాజకీయాల్లోకి మారేముందు ఆయన చేసిన సినిమా... అజ్ఞాతవాసి. అది అట్టర్ ఫ్లాప్. అంతకు ముందు విడుదలైన కాటమరాయుడు, సర్దార్ గబ్బర్ సింగ్ కూడా పెద్దగా ఆడలేదు. వీటిలో ఏ సినిమా కూడా 100 కోట్ల వసూళ్లు అందుకోలేదు. అయినా కూడా ఆయనతో సినిమాలు చేసేం దుకు నిర్మాతలు ఎగబడుతున్నారు.

వకీల్ సాబ్... ఆయన రెండో ఇన్నింగ్స్‌లో మొదటి సినిమా. ఈ సినిమాకి ఆయన 50 కోట్లు అందు కుంటున్నారు. ఇది విడుదల కాక ముందే క్రిష్ డైరెక్షన్‌లో ఒక సినిమా మొదలుపెట్టి పక్కన పెట్టాడు. లేటెస్ట్‌గా అయ్యపనం కోషియం అనే మల యాళ సినిమాని పవన్ కళ్యాణ్ హీరోగా మొదలుపెడు తున్నారు. ఈ సినిమాకి ఆయన పుచ్చుకునే పారితోషికం... అక్షరాలా 60 కోట్ల రూపాయలు. ఇవి కాకుండా హరీష్‌శంకర్, సురేందర్ రెడ్డి డైరెక్షన్‌లో కూడా సినిమాలు ఉన్నాయి.



పవన్ కళ్యాణ్ - ఆదాయం 200 కోట్లు
వకీల్ సాబ్ (సెట్స్ పై ఉంది)
క్రిష్ మూవీ
అయ్యపనమ్ కోషియం రీమేక్
హరీష్‌శంకర్ మూవీ
సురేందర్ రెడ్డితో సినిమా

2022లోపు ఇవి పూర్తి అవుతాయి. 2022 తర్వాత ఆయన పూర్తిగా ఏపీ రాజకీయాల్లో తల మునకలవుతారు. 2023 లేదా 2024లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో తాడోపేడో తేల్చుకోవాల్సిన అవసరం ఉంది. ఆలోపు ఎంత సంపాదించుకుంటే అంతా బెటర్ అన్న ఉద్దేశంలో ఇవి ఒప్పుకున్నారు పవన్ కళ్యాణ్. సో... ఈ సినిమాల ద్వారా పవన్ కళ్యాణ్‌కి 200 కోట్లపైనే ఎర్నింగ్ వస్తుంది.

వకీల్ సాబ్, క్రిష్ సినిమా మినహా మిగతావన్నీ కరోనా టైంలోనే అంగీకరించాడు. మార్కెట్ ఎలా ఉంటుందో తెలీకుండానే నిర్మాతలు పవన్ కళ్యాణ్‌కి ఆ రేంజ్‌లో పెంచేశారు.

## పవన్ మూడ్ స్వింగ్స్ ఖర్చు అదనం

పవన్ కళ్యాణ్‌తో మరో ఖర్చు కూడా ఉంది. ఆయన ఎప్పుడు షెడ్యూలు పెట్టుకోమంటారో, ఎప్పుడు క్యాన్సిల్ చేస్తారో తెలియదు. నిర్మాతలు వాటికి ప్రిపేర్ అయి ఉండాలి. సడెన్‌గా ఆయన ఏపీలో ఏదో ఒక రాజకీయ పర్యటన పెట్టుకుంటే... అక్కడికి వెళ్లేందుకు స్పెషల్ ఫ్లైట్ కావాలంటే నిర్మాతలు ఆరెంజ్ చెయ్యాలి. వకీల్ సాబ్ మొదటి షెడ్యూలు షూటింగ్‌కి ప్రతిరోజూ విజయవాడ నుంచి హైదరాబాద్‌కి స్పెషల్ ఫ్లైట్ వేసుకొని వచ్చారు. ఆ ఖర్చు దిల్‌రాజుదే. తెలంగాణాలోలాగ ఏపీ రాజకీయాలు ఇంకా వేడెక్కలేదు. కానీ ఏపీలో వచ్చే ఏడాది స్థానిక ఎన్నికలు జరుగుతాయి. అప్పుడు పవన్ కళ్యాణ్ మళ్లీ టూర్స్ పెట్టుకుంటారు. సో, దానికి ప్రిపేర్ అయి ఉండాలి నిర్మాత. ఇలాంటి ఖర్చులు ముందే బడ్జెట్‌లో వేసుకోవాలి.

అయితే, పవన్ కళ్యాణ్‌లో ఓ మంచి గుణం ఉంది. ఆయన తన స్టాఫ్‌కి, ఇతర మెంబర్స్‌కి అయ్యే ఖర్చు ఆయనే భరిస్తారు. జనరల్‌గా పెద్ద హీరో

సినిమాకి ఈ ఖర్చు కూడా ఎక్కువే ఉంటుంది. కానీ పవన్ కళ్యాణ్ తానే పెట్టుకుంటాడు.

### 60 ప్లస్‌లోనూ కోట్లే కోట్లు

మెగాస్టార్ చిరంజీవికి ఇప్పుడు ఉన్న కెరీర్ ఒక డెజర్ట్ లాంటిది. ఆయన మీల్స్ ఎప్పుడో కానిచ్చేశారు. 2008లోనే ఆయన నంబర్ వన్ శకం ముగిసింది. రాజకీయాల్లోకి వెళ్లి పరాజయం పాలై... చాలా ఏళ్లు గ్యాప్ తీసుకొని... *ఖైదీ నంబర్ 150* సినిమాతో మళ్లీ నటిస్తున్నారు. మొదట ఆయన రెండేళ్లకి ఒక సినిమా చేద్దామనుకున్నారు. ఇప్పుడు స్పీడ్‌గా సినిమాలు చేసి ఎందుకు సంపాదించాలని అనే భావనతోనే కొత్త ఇన్నింగ్స్ మొదలు పెట్టారు. కానీ, తన డ్రీమ్ ప్రాజెక్ట్ సైరా నరసింహారెడ్డి చాలా నష్టాలు మిగల్చడంతో మేలుకున్నారు. ఇప్పుడు స్పీడ్‌గా సినిమాలు చేసి తన కుమారుడి బ్యాంకు అకౌంట్ నింపాలనేది చిరంజీవి ఆలోచన.

అందుకే... లాక్‌డౌన్ టైంలోనే మెగాస్టార్ మూడు కొత్త సినిమాల లీకులిచ్చారు. ఒక్కో సినిమాకు ఆయన పారితోషికం 50 నుంచి 60 కోట్లు. ప్రస్తుతం చేస్తున్న ఆచార్య కాకుండా ఆయన లూసిఫెర్ రీమేక్, వేదలమ్ రీమేక్, బాబీ డైరెక్షన్‌లో ఒక మూవీ లైన్‌లో పెడతారు. వీటితో ఆయన 150 కోట్లపైనే వెనకేసుకుంటారు.



**చిరంజీవి - ఆదాయం 150 కోట్లు**
ఆచార్య (సెట్స్ పై ఉంది)
లూసిఫర్ రీమేక్
వేదాలమ్ రీమేక్
బాబీ మూవీ

### నితిన్, నాని అదే పాలసీ

నితిన్, నాని వంటి యువ హీరోలు కూడా 40 కోట్లు సంపాదించుకునేలా కొత్త సినిమాలు ప్రకటించారు. నితిన్ గ్యాప్ లేకుండా షూటింగ్స్ చేస్తున్నాడు. 2021లో కనీసం మూడు సినిమాలు విడుదలవుతాయి. అలాగే నాని. నేచురల్ స్టార్ నానిది మొదటి నుంచి అదే పాలసీ. కాకపోతే రీసెంట్‌గా సినిమాలు పెద్దగా వసూళ్లు సాధించట్లేదు. కొంచెం గ్యాప్ కూడా వచ్చింది. నాని మార్కెట్ కాస్త డౌన్ అయింది అనే ఉద్దేశంతో ఒక నిర్మాత మీన మేషాలు లెక్కించాడు. దాంతో శ్యామ్ సింగరాయ్ అనే ఆ సినిమాని వేరే నిర్మాతకి అప్పచెప్పాడు. తన రేట్ మాత్రం తగ్గించుకోలేదు.

| | |
|---|---|
| **నితిన్ ఆదాయం - 40 కోట్లు** | **నాని ఆదాయం - 40 కోట్లు** |
| రంగ్ దే (సెట్స్ పై ఉంది) | టక్ జగదీష్ |
| చెక్ | 2. శ్యామ్ సింగ రాయ్ |
| అంధధూన్ రీమేక్ | 3. అంటే సుందరానికి |
| పవర్ పేట | 4. కొత్త దర్శకుడితో మూవీ |

### ఎలా వర్కవుట్ అవుద్ది?

నిజానికి సినిమాకి ప్రధాన ఆదాయం... థియేటర్ల వసూళ్లే. థియేటర్లు మళ్లీ ఫుల్ జోష్‌లోకి వచ్చేందుకు ఇంకా ఎన్ని నెలలు పడుతుందో ఎవరూ చెప్పలేరు. అలాగే, అమెరికా మార్కెట్ ఇప్పట్లో కోలుకోదు. హాలీవుడ్ సినిమాలన్నీ 2022కి పోస్ట్‌పోను చేసుకుంటు న్నాయి. కొన్ని డైరెక్ట్‌గా HBO MAXలోనూ, థియేట ర్లోనూ ఒకేసారి రిలీజ్ అయ్యేలా ప్లాన్ ప్రకటించాయి. హాలీవుడ్ కంపెనీలే... అమెరికా థియేటర్ల వసూళ్లపై మరో రెండేళ్లవరకు ఆశలు పెట్టుకోవడం లేదు. మరి తెలుగు సినిమాలకి ఓవర్ సీస్ మార్కెట్ ఉంటుందా? ఇండియాలో కూడా అంతా కుదురు కునేసరికి ఇంకా ఎంత లేదన్నా... ఆర్నెల్ల నుంచి ఏడాది టైమ్ పడు తుంది. ఇలాంటి పరిస్థితులలో హీరోలు ఎందుకు ఇంతగా రేట్స్ పెంచుతున్నారు? నిర్మాతలు సినిమాల మీద సినిమాలు ప్రకటిస్తున్నారు?

భవిష్యత్‌లో ఓటిటీ మార్కెట్ బాగా పెరుగుతుందనే ఒక అంచనాలో ఉన్నారు. వాటికి కంటెంట్ కావాలి. అప్పుడు స్టార్ సినిమాలకు క్రేజ్ ఉంటుంది. ఈ అంచనాతో మన నిర్మాతలు పెద్ద సినిమాలు ప్రకటిస్తున్నారు. హీరోలకు అంతగా అమౌంట్స్ ఇస్తున్నారు.

# Vadilal
Ice creams

# రుచికరమైన అనుభూతి

Relish the most authentic Indian treats from Vadilal,
a brand with a 100-year-old legacy of
serving goodness and happiness.




Made From 100% Milk

NO EGGS.
NO PRESERVATIVES.
NO ARTIFICIAL FLAVORS.

మళ్ళీ
ప్రాయూళి జ్ఞాపకాలు

# ఇలా దగా చేసేరేంటి మేస్టారూ?



నా ఈ చిన్నజీవితంలో నేను చూసిన గొప్పవాళ్లు ముగ్గురు... ఇళయరాజా, బాలూ, బాపూ.

వీళ్లు వందేళ్ల కోసారన్నా పుడతారో లేదో!!!

నేనంటే నేనే సినిమా మా పక్కనే ఉన్న రామ చంద్రపురం అన్నపూర్ణా పిక్చర్ పేలస్‌లో మాగొప్పగా ఆడేసెళ్లిన రోజులు. ఏ కుర్రోడి నోట్లో చూసినా గుంతలకిడి గుంతలకిడి గుంతలకిడి గుమ్మా అన్న పాటే. సరిగ్గా అదే టైములో కిషోర్ టాకీస్‌లో ఆ పాట పాడిన గాయకుడు ఎస్పీబాలసుబ్రమణ్యం మ్యూజికల్ నైట్. మొట్టమొదట బాలూగారిని చూసింది ఆ రాత్రే. దక్కను సిగరెట్టు పెట్టి డొక్కు మీద గుంతలకిడి గుమ్మా పాట పాడమని రాసి పట్టికెళ్లిస్తే నవ్వుతా దాన్ని తీసుకుని, 'పాడతా వెళ్లి కూర్చో,' అన్నారు.

*

నాలాంటోళ్లు చాలామంది అడిగినియ్యన్నీ పాడిన బాలూగారు లాస్ట్‌లో గుంతలకిడి గుమ్మా పాడుతుంటే జనాల్లో చప్పట్లు, కేకలే కేకలు 'ఒన్స్ మోర్' అంటా అరుపులు.

మద్రాసెళ్లినప్పుడు, ఆవేళ మధ్యాన్నం మూడు గంటలు దాటేకా ఆయన్ని చూద్దామని మహాలింగ పురం అయ్యప్ప గుడి దగ్గర్లో వున్న ఆ బాలూగారింటి దగ్గరకెళ్తే ,అప్పటికే అక్కడ నిలబడి ఉన్న నాలాంటి అభిమానులకి సంతకాలు పెడతా, 'ఇప్పుడే రికార్డింగు నించొచ్చేను. భోంచేసి మళ్లీ వెళ్లాలి,' అనేసి నవ్వుతా వాళ్లని సాగనంపుతున్న ఆయన్ని కాస్త దూరాన్నించి చూసి ఇప్పుడు నేనెళ్లి ఇబ్బంది పెట్టకూడదనుకుంటా వెనక్కెళ్లిపోయేను.

ఆ తర్వాత నేను అసిస్టెంటుగా చేరిన నా మొదటి సినిమా ఎదురీత రికార్డింగు జెమినీ స్టూడియోలో. ఎదురీతకు అంతం లేదా... అన్న పాట పాడుతుంటే అద్దాల తలుపుల వెనక నించి చూశాను బాలూగార్ని.

శంకరాభరణానికి వేటూరిగారు రాసిన పాటల్ని కాపీలు రాస్తున్నప్పుడు ఆయన దృష్టిలోకెళ్లిన నేను ఆ సినిమా వెండితెర నవల రాసిప్పుడు జరిగిన ఒక ఇన్సి డెంటుతో కాస్త గుర్తుండిపోయేనాయనకి.

*

నేను డైరెక్ట్ చేసిన నా ఫస్ట్ సినిమా మంచు పల్లకీలో పాటలు పాడటానికి జెమినీ స్టూడియో కొచ్చి నప్పుడు నా గురించి చెప్పి గుర్తు చేస్తుంటే, 'అయ్యో నువ్వెందుకు గుర్తులేవు వంశీ?' అంటా నా భుజం మీద చెయ్యేసి పాట నేర్చుకోడంలో పడిపోయేరు.

ఏ మ్యూజిక్ డైరెక్టర్ పాట కంపోజ్ చేసినా పాడాల్సింది బాలూ. ఏ రికార్డింగ్ థియేటర్లో చూసినా కనిపించేది బాలూ, పొద్దుట్నుంచి పొద్దోయేదాకా పాడు తున్నది బాలూ. మ్యూజిక్ సంబంధించి ఎక్కడేం జరుగుతున్నా బాలూ బాలూ బాలూ...

ఎప్పుడు లేస్తున్నాడో ఎప్పుడు తింటున్నాడో ఎప్పుడు పడుకుంటున్నాడో తెలీదు. ఎప్పుడూ ఎవర్నీ నొప్పించకుండా చిరునవ్వుతో పాడుతానే ఉంటు న్నాడు.

అలాంటి బాలూ సడన్‌గా పాడ్డం మానేసేడు. అసలెవరికీ కనిపించడమే మానేసేడు.

బాలూకి త్రోట్ కేన్సరొచ్చిందంటన్నారు, అందుకే అతను కనిపించడం లేదంటన్నారు. ఇంకా చాలా చాలా అంటన్నారు. లెక్కలేనన్ని, లెక్కెట్టలేనన్ని అంట న్నారు. అప్పుడింకా టీవీ చానెల్స్ ముమ్మరం లేదు. అయినా... తెలుగూ, తమిళం, కన్నడం, మలయాళం, ఆంగ్లం ఇలా పేపర్లనిండా రాతలే రాతలు.

సడెన్‌గా ఆవేళ ఇళయరాజా థియేటర్ కొచ్చి పాట పాడేరు. అది కుకుకూ కుకుకూ కోకిల రావే... అన్న సితార సినిమాలో పాట.

అసలు జరిగిందేంటంటే... బాలూగారి ఓకల్ కార్డ్ మీద పొక్కులాంటి దొకటొచ్చి పాడనీకుండా చాలా ఇబ్బందీ, చాలా బాధ పెట్టేస్తుంది.

దాన్ని రిమూవ్ చెయ్యడానికి అవస్థలు పడ్డ డాక్టర్లు, ఆపరేషనయ్యేక, 'ఇవ్వాల్టినించీ మూడు నెలలపాటు చిన్న పలుకు కూడా పలక్కూడదు. గొంతుక్కి పూర్తి రెస్టు,' అనేసి వార్నింగియ్యడంతో సైలెంట్‌గా ఇంట్లో కూర్చుండిపోయారా బాలూగారు.

అది తెల్సిన లతా మంగేష్కర్‌గారు. అప్పు డప్పుడూ బాలూగారికి ఫోన్‌చేసి, 'మీరేం మాటాడ

కండి నేను మాటాడుతుంటే 'ఊ' అని కూడా అనొద్దు. సైలెంట్‌గా వినండంతే,' అంటా ఆవిడే మాటాడతా మధ్య మధ్యలో పాడతా ఉండేవారు.

మూడు నెలలు గడిచేకా ఆవేళ పొద్దుట ఆ పాట పాడిన బాలూగారు, ఆ సాయంత్రం పక్కనే ఉన్న ఏడిద నాగేశ్వర్రావుగారింటి కొచ్చి పొద్దుట పాడిన ఆ పాట ఒకటి రెండుసార్లు విని 'బాగుంది' అనేసెళ్లి పోయారు.

కొన్నేళ్లు గడిచాయి

ఆవేళ సాయంత్రం నా పాట పాడి రికార్డింగ్ థియేటర్లోంచి బయటికొస్తా, "ఔనూ... నీకు మట్టుకే మైనర్ స్కేల్‌లో ఇంత బాగా చేస్తున్నాడు రాజా కారణ మేంటీ?.... ఇదే వాడ్నడిగితే నవ్వేసెళ్లిపోతున్నాడు తప్ప జవాబు చెప్పడం లేదు. నువ్వు చెప్పు," అన్నారు.

నవ్వేసిన నేను, "ఆయన నా మాట వినడం నా అదృష్టం కదాండి," అంటా ఆయన్ని కారెక్కించేను.



అప్పుడెప్పుడో జరిగిన ఈ సంగతి ఈ మధ్య స్వరాభిషేకం ప్రోగ్రాంలో సుమ కనకాలగారితో కూడా చర్చించేరు.

*

నేను తీసిన లాయర్ సుహాసిని అనే సినిమాకి మ్యూజిక్ డైరెక్టర్ ఈయనే. ఒక పాట మ్యూజిక్ కంపోజింగ్ వాళ్లింట్లో ఆయన బెడ్రూమ్‌లో చేస్తూ నన్ను పిలిస్తే వెళ్లిన నేను ఆ గదిలో ఉన్న ఒకే ఒక్క ఫొటో చూసి షాకయిపోయేను.

"నా ఫేవరేట్ యాక్టర్," అన్నారు. అదెవరంటే కమలహాసన్. తనకిష్టమైందేదైనా సరే అంత బహి రంగంగా చెప్పేసే మనిషాయన.

ఎప్పుడూ ఆయన మెచ్చుకునే వాళ్ల గురించే చెపుతారుగానీ, ఆయన్ని మెచ్చుకునే వాళ్ల గురించి చెప్పరుగాక చెప్పరు అనడానికో ఉదాహరణ...

మహమ్మద్ రఫీ ఆయనకి దేవుడు. అసలు తను గాయకుడు కావడానికి ఆ దేవుడే కారణం. తన కోదండపాణి ఆడియో లేబ్ గుమ్మం దగ్గర గురువు కోదండపాణిగారి పెయింటింగ్‌తోపాటు రఫీగారి ఫొటో కూడా ఉండేది. అయితే బాలూగారు పాడిన చాలా పాటలు హిందీలో డబ్ చేసినప్పుడు, వాటిని పాడిన రఫీగారు బాలూగార్ని చాలా మెచ్చుకునేవారు.

కానీ విచిత్రం... ఆ సంగతులు ఎప్పుడూ, ఎక్కడా, ఎవరికీ చెప్పలేదు బాలూ.

ఆవేళ కంపోజింగ్‌లో ఆయన చేసిన ట్యూన్ నచ్చకపోయేటప్పటికి చెప్పేసి బయటికొచ్చేస్తుంటే ఏమాత్రం ఫీలవ్వకుండా మర్నాడు మధ్యాన్నం జెమినీ లో పాడొస్తా దార్లో అనుకున్న ఒక అద్భుతమైన ట్యూన్ ఇంటికొచ్చిన వెంటనే డెమో కేసెట్లో రికార్డ్ చేసి ఎప్పుడూ వాళ్ల దగ్గరుండే సౌండ్ ఇంజనీర్ రమేష్‌తో పంపించేరు.

దివిని తిరుగు మెరుపులలన సామజవర గమనా... సీతారామ శాస్త్రిగారు రాసిన లిరిక్‌కి ట్యూన్ చేసిన ఆ పాట నాకు చాలా నచ్చింది.



అదే ఆయనకి ఫోన్ చేసి "చాలా బాగుంది సార్. ఫిమేల్ వెర్షన్ బాగా పాడేరు శైలాగారు. రేపు ఆవిడతోనే పాడిద్దాం," అన్నాను.

"ట్యూన్ పాడింది మా చెల్లెలు గదా అని మెయిన్ ట్రాక్‌లో పాడించడం లాంటివి పెట్టుకోకు. ఆ ట్యూన్‌కి తన వాయిస్ నీకు నచ్చితేనే," అన్నారు.

"మీ సొంత మనుషుల విషయంలో మీరెంత నిర్మొహమాటో నాకు తెల్సు. ఆ ట్యూన్‌కి ఆవిడ గొంతు బాగుందండీ."

"నీకు తెల్సు చాలా ప్రతిభ గలవాడు ఆ వెన్నెల కంటి. స్టేట్ బేంక్‌లో పనిచేస్తా శలవు పెట్టి వచ్చి పాటల కోసం ట్రై చేస్తున్నాడు. ఆమధ్య మహర్షి సినిమాలో ఒక అద్భుతమైన పాట ఇచ్చేవు. అలాంటివో రెండు మూడిస్తే సెటిలైపోతాడయ్యా అతను," అన్నారావేళ...

ఆయన చెప్పేరుగదాని అప్పుడు చేస్తున్న చెట్టు *కింద ప్లీడరు* సినిమాలో *చలీకా నామ్ గాడీ...* పాటా, *అల్లిబిల్లి కలలా రావే...* అన్న పాటా ఇచ్చేను.

బేంక్‌లో పనిచేసే చంద్రమోహన్‌గారి మేనల్లుడు శివలెంక కృష్ణప్రసాద్ చిన్నోడు పెద్దోడు అన్న సినిమా తీస్తా బాలూగార్ని మ్యూజిక్ డైరెక్టర్‌గా పెట్టుకున్నాడు.

చిన్నోడు పెద్దోడు సినిమా ప్రొడక్షన్ టైములో శివలెంక క్రిష్ణప్రసాద్ హార్డ్ వర్కింగ్ చూసిన బాలూగారు నువ్వో పెద్ద సినిమా తియ్యాలని అతన్తో దెబ్బలాడేసిన తర్వాత బాలక్రిష్ణగారితోనూ, సింగీతంగారితోనూ, ఇళయరాజాగారితోనూ మాటాడి ఒక పెద్ద సినిమా తీయించేరు.

దాని పేరు ఆదిత్య *369*. ఆ ఎంకరేజ్‌మెంట్‌తో మంచి ప్రొడ్యూసర్ గా నిలబడిపోయాడా కృష్ణప్రసాద్.

"సినిమా పేరడైజో, క్రిస్టోఫ్ కిస్లవస్కీ కలర్ ట్రయాలజీ డివీడీలు నాకు కావాలి. ఇంటర్నేషనల్ కరెన్సీకార్డ్ నాకు లేదు యాభైయూరోలకి మీరు సంతకం పెడతారా?" అని నేనడిగితే, "ఇంత చదవక్కర్లేదు. అవతల నాకు టేక్ టైమవుతుంది," అంటా నా చేతిలో పెన్ తీసుకుని సంతకం పెట్టేసి నన్ను బయటికి గెంటేసేరు.

అది చూసిన ఆయన సెక్రటరీ విఠల్‌గారు, "వెనకటికి బాలూ ఇలా సంతకం పెట్టి పీకల్దాకా ఇరుక్కుపోయిన కథ ఒకటుంది," అన్నారు.

"నాది కేవలం ఏభై యూరోల కథ ఇండియన్ కరెన్సీ ఇక్కడ మీకిచ్చేస్తాను," అనేటప్పటికి నవ్వేసినా విఠల్‌గారు, "ఆయన సంతకం పెట్టడం చూస్తుంటే ఆనాటి ఆ కథ గుర్తొచ్చి అన్నానంతే," అన్నారు.

"ఏంటి సార్ ఆ కథ?"

పేరు బయటికి చెప్పడం బాలూగారికి ఇష్టం ఉండదు గాబట్టి ఈయన మిత్రుడు తీస్తున్న ఒక సినిమా.వీ ఎరు సంతకం పెడితే ఫైనాన్షియర్ డబ్బిస్తాడు అంటే సంతకం పెట్టేరు బాలూగారు. ఆ సినిమా తేడా రావటంలాంటిదేదో జరిగితే ఆ మొత్తం డబ్బు బాలూగారు కట్టాల్సొచ్చింది," అనా విఠల్‌గారు చెపుతుంటే సంతకం చెయ్యడం చూసిన ఆయన కిదంతా గుర్తుకొచ్చిందన్నమాట అనుకుంటా బయటికొచ్చేను.

ఆయన అమెరికాగానీ వెళ్లడం జరిగితే తిరిగొచ్చేటప్పటికి థియేటర్లలో కుప్పలుతెప్పలుగా పడుండేవి ట్రాక్స్.

నవ్వుతానే చుట్టూ వున్న వాళ్లని నవ్విస్తానే రాత్రీ పగలనక కష్టపడి పాడేవారా బ్రేక్సన్నీ. అలా పాడి సంపాదించిన డబ్బు చాలా పోగెయ్యాలి ఆయన. కానీ, పోగెయ్యలేదు.

ఆ వర్క్‌హాలిక్ స్నేహానికిచ్చిన విలువ డబ్బుకియ్యలేదు. సాయానికిచ్చిన విలువ డబ్బు కియ్యలేదు. అసలు ఆయనకున్నంత మంది స్నేహితులు ఈ ప్రపంచంలో ఇంకెవ్వరికీ లేరనిపిస్తుంది.

అన్ని వేల పాటలు పాడిన బాలూగార్ని ఎన్ని వేల మంది కల్సుంటారు. వాళ్ల పాట క్వాలిటీ వాళ్లకి కావల్సిన విధంగా రావడానికి ఎన్ని విధాలుగా చెప్పుంటారు, చర్చించి ఉంటారు?

వాళ్లందరి మధ్యా నవ్వుతా కలతిరుగుతా తెలుగు సరే అది తమిళం అచ్చం తమిళ వాడు పాడిన తమిళపాట లాగ, కన్నడం అయితే అచ్చం కన్నడిగుడు పాడిన కన్నడం పాటలాగ, అది ఏ భాషైతే అచ్చం ఆ భాషవాడు పాడిన పాటలాగ పాడేసి కన్సోల్ రూమ్‌లో ఉన్నవాళ్లతో మా గొప్పగా ఒప్పించుకుని, మెప్పించుకుని బయటికొచ్చేవారు.



అలాగే తెలుగులో పాడుతా తీయగా, కన్నడంలో యెద తుంబె హదువేను... ఎందర్నో ఎంకరేజ్ చేస్తా ఎంతోమంది సింగర్స్‌ని తయారు చేసేరు. ఓడిపోయిన వాళ్లెంతోమందిని తిరిగి నెగ్గేలా ఎంకరేజ్ చేసేరు? ఇన్ని లక్షల మందిలో ఏ ఒక్కడ్నన్నా నొప్పించేరా? బాధపెట్టేరా? అసలీ ప్రపంచంలో ఆయన్ని శత్రువులా చూసేవాడే లేడా???

ఇంత హుషారుగా నవ్వుతా ఇన్ని లక్షల మందికి అస్మదాప్తుడైన శ్రీ ఎస్పీ. బాలసుబ్రమణ్యంగారికి బాధలు లేవనా?

అవస్థలు లేవనా? చాలా ఉన్నాయి. చాలా చాలా ఉన్నాయి.

*

ఎన్ని రంగుల జ్ఞాపకాలు
ఎన్నో హంగుల జ్ఞాపకాలు
తడిసిన ఆ జ్ఞాపకాలు
మెరిసిన ఆ జ్ఞాపకాలు
మాట్లాడిన జ్ఞాపకాలు
పోట్లాడిన జ్ఞాపకాలు
శృతిమారిన జ్ఞాపకాలు
పొలమారిన జ్ఞాపకాలు

ఇది సినిమాపాట కాదు. టీవీ ప్రోగ్రామ్స్‌కి సంబంధించిందిగానీ వెబ్‌కి సంబంధించింది గానీ మరి దేనికి సంబంధించింది కాదు.

నా ఆత్మీయ మిత్రుడు డాక్టర్ చంద్రశేఖర్‌కి సంబంధించింది. ఔను. లాస్టియర్నుంచి స్వాతిలో రాసి ఆ తర్వాత నా ఫేస్‌బుక్ పేజీలో నేను పెడ్తున్న పొలమారిన జ్ఞాపకాల్ని ఎవరైనా ప్రొడ్యూసర్ దొరికితే వెబ్ సిరీస్ చేద్దామని దానికి రాసిన టైటిల్ సాంగ్ తాలూకు పల్లవిని ఆ శేఖర్‌గారికి పంపిస్తే మొత్తం పాట రాసేకా ఒక పాటగా రికార్డ్ చేసి నాకివ్వండి అన్నారు.

"ఎందుకూ?" అన్నాను.

"రోజూ నా కార్లో పెట్టుకుని నేను మాత్రం వినడానికి."

"ఏంటీ?"

"ఔను," అంటా నవ్వేసిన శేఖర్ అదే ముక్క చాలా సీరియస్‌గా చెప్పేటప్పటికి ఈ లాక్ డౌన్ టైములో నాలుగోడల మధ్య కూర్చుని పాట రాసేకా ట్యూనూ, బేక్ గ్రౌండ్సూ కంపోజ్ చేసి రికార్డ్ చేసిన ఆ పాట శేఖర్‌గారికిస్తే ఇంతా అంతాగానంత ఇదితో దాన్నందుకున్న ఆ పెద్దమనిషి ప్రతిరోజూ ఆఫీసు కెళ్లేటప్పుడు కార్లో ఆ పాట వినే పనిలో పడ్డారు. టీవీ5 లో బిజినెస్ ఎడిటరయిన నా ఫ్రెండ్ వసంత్‌కి ఎస్పీ బాలూగారంటే ఆరో ప్రాణం.

అసలాయన వాయిస్ తప్ప మాగొప్పోడైన మహమ్మద్ రఫీ లాంటోడి వాయిస్ కూడా వినని వసంత్, రాక్షసుడు సినిమా డైరెక్టర్ రమేష్‌వర్మతో పాటు నా దగ్గరకొచ్చేరావేళ.

నాకు లాంగ్ డ్రైవ్స్ అంటే చాలా ఇష్టమని తెల్సిన వసంత్ అలా సంగారెడ్డి దాకా వెళోద్దామా అంటా డ్రైవింగ్ సీట్లో కూర్చుని స్టార్ట్ చేశాడు.

మొత్తంగా చర్చి దాటాకా నా జేబులో వున్న పెన్ డ్రైవ్ వసంత్ ప్లేయర్లో గుచ్చేటప్పటికి ఈ జ్ఞాపకాల పాట విన్న వసంత్ బాగుంది పాడిందెవరు?

ఎవరో అంటా చెప్పేను.

"ఈ పాట మన బాలుగారు పాడితే అలాగిలా గుండదు," అన్నాడు వసంత్.

"ఔను నిజమే," అన్నాడా రమేష్ వర్మ.

వాళ్లలా మాటాడుకుంటుంటే పూర్వం చాలా మంది ట్రాక్ సింగర్స్ పాడిందానికీ తరువాత బాలుగా రొచ్చి పాడిందానికి వచ్చిన మా గొప్ప తేడా గురించి తెల్సిన నేను వీళ్లు చాలా సబబుగా మాటాడున్నారని పించింది.

"సార్ మీరు మ్యూజిక్ చేసినీ పాట బాలూగారు పాడ్డం జరిగితే మరిలాగలాగుండదు. మీరు కొత్తగా మ్యూజిక్ డైరెక్టర్ అవతారం ఎత్తాల్సొస్తుందేమో అనిపిస్తుంది," అంటా బాసరదాకా డ్రైవ్ చేసినా వసంత్ దారిపొడుక్కీ ఇదే పాట ఎన్నిసార్లు విన్నాడో ఆయనకే తెలీదు.

"రేపు మా బాలూగార్ని కల్సి ఈ పాట గురించి మాటాడ్తాను. దాంతోపాటు ఆ మధ్య మీతో డిస్కస్ చేసిన ఆ టాపిక్ గురించి కూడా మాటాడెయ్యనా?" అన్నారు.

"ఏ టాపిక్కూ?" అన్నాను.

"ఇంత మతిమరుపేంటండీ... అదే ఆయన ఆత్మకథ... ఆయన్నే హీరోగా పెట్టి సినిమా తీద్దామను కున్నాం గదా... ప్రొడ్యూసర్ నేనే అని చెప్పేను. మర్చి పోయేరా ఏంటీ?" అన్నారు.

"ఒప్పుకోరేమో వసంత్‌గారూ?"అన్నాను.

"సరదాకన్నట్టు అడిగి చూస్తాను," అంటా కొల్లూరులో నా ఫ్లాట్ ముందు దించెళ్లిపోయేరు.

❉

ఆ సాయంత్రమే ఫోన్‌చేసి అర్జంటుగా నన్ను కల్సినా వసంత్ షాకయిపోతా నన్ను చూస్తా జరిగిం దంతా చెప్పేడు.

సారథీ స్టూడియోలో పాడుతా తియ్యగా ప్రోగ్రామ్ చేస్తున్న బాలూగార్ని కల్సిన వసంత్ విన్న జ్ఞాపకాల పాట గురించి చెప్పి, "మీరు పాడితే మామూలుగా వుండదు సార్," అన్నాడు.

"ఎవరు మ్యూజిక్ డైరెక్టరు?" అడిగేరు.

చెప్పేడా వసంత్. విన్న బాలూగారు, "అతనిం తకు ముందు నాలుగైదు సినిమాలకి మ్యూజిక్ చేసేడు తెలీదా వసంత్ మీకు?"

"తెలీదు సార్."

"నాలుగు పాటలు ఇళయరాజా చేస్తే ఐదో పాట ఇతనే లిరిక్కూ, మ్యూజిక్కూ చేసేడు."

"ఔనా!!!"

"యవ్వనాల పువ్వులన్ని నవ్వుతున్న తోటలో ప్రేమయాత్ర చేద్దామా.... సీమయాత్రలకి బృందా వనమూ నందనవనమూ ఏలనో...

"ఔనా!!!"

"ఎన్నిసార్లు ఔనా అంటారండీ. ముందు విషయం చెప్పండి."

"ఈ జ్ఞాపకాల పాట మీరు పాడాలి సార్."

"తప్పకుండా పాడతాను కరోనా వెళ్లొద్దూ అంటా నా వైఫ్ సావిత్రి గొడవ చేస్తే కాదంటా వచ్చేను. వచ్చే పిస్టేన్స్ వచ్చినప్పుడు మా సెక్రెటరీ చందూ చెప్తాడు థియేటర్ బుక్ చేసుకోండి."

జరిగిందంతా నాకు చెప్పినా వసంత్, "మీరు మ్యూజిక్ చేసినట్టు నాకెందుకు చెప్పలేదూ?" అంటా నిలదీసేడు.

"చెప్పేను సార్. అప్పుడు మనం జింకానా క్లబ్బులో వున్నాం."

"ఉంటే?"

"పరమ మందులో వున్నాం."

"ఉంటే?"

"ఉంటే అంటారేంటీ... మీకు బాలుగారు తప్ప ఇంకేం వినపడవుగదా. అప్పుడప్పుడూ ఒక్క ఇళయ రాజా పేరు మట్టుకు చెప్తుంటారు. మిగతా ఇంకెవరి గురించి చెప్పరు వినరు."

నేను కొత్తగా కంపోజ్ చేసిన జ్ఞాపకాల పాట బాలూగారు పాడేకా అని ఊహించుకుంటున్నాను. బ్రేక్‌లో ఆయన గొంతు చేరేకా ఆ పాటే వేరు. అది నాకు చాలా బాగా తెల్సు గాబట్టి ఎదురుచూస్తున్నాను.

❋

గెడ్డం పెంచేసుకున్న ఎస్పీ చరణ్ రోజూ ఆయన హెల్త్ రిపోర్ట్ చెప్తుంటే దేశంలో వున్న మొత్తం జనంతో పాటు ఆత్రంగా వింటూ, 'మరి రేపే వార్త చెపుతాడో చక్కని శుభవార్త చెప్పాలి,' అనేసి ఎదురుచూస్తున్నాం.

❋

ఆవేళ క్లీన్ షేవ్‌తో నవ్వుతా కనిపించిన ఆ ఎస్పీ చరణ్, "నాన్నగారికి నెగిటివ్ వచ్చింది," అన్న శుభవార్త చెప్పేటప్పటికి ఎగిరి గంతేసిన వసంత్ "ఈ రాత్రికి పార్టీ... నేనిస్తాను సేమ్ జింకానా క్లబ్‌లో. వచ్చేవారమే మన రికార్డింగ్," అంటా చాలా అల్లరి చేసేసేడు.

తెల్లవారేకా వచ్చిన వార్త...

బాలు- శ్రీ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం చనిపోయేరన్న దారుణమైన వార్త టీవీలో, ఫేస్‌బుక్కులో ఇంకా ఎక్కడ పడితే అక్కడ.

వింటున్న నాకు, చూస్తున్న నాకు అర్థం గావట్లేదు. అది నిజం అన్నమాట నా సొంతం కావట్లేదు. మీకేవన్నా మెంటలా? విడ్డూరం గాపోతే, అసలు బాలూగారు చనిపోవడం ఏంటీ!!!

అసలిది ఎప్పుడన్నా ఊహించేమా!!

...నిజమా ...నిజంలో కలా ...అసలేంటిదీ ... ఏమాత్రం అర్థంకావటం లేదు??...

ఇన్నాళ్లయిపోయినా ఇంకా అర్థం కావట్లేదు. ఆయన చనిపోడం ఏంటీ అప్పుడప్పుడూ అమెరికా వెళ్లినట్టు. ఇప్పుడు కూడా ఎక్కడికో చాలా చాలా దూరం వెళ్లేరు. ఇప్పుడో మరెప్పుడో వచ్చేస్తారు... వచ్చేస్తారు... ఈ ఫీలింగ్ నా ఒక్కడిది మట్టుకే కాదు ప్రపంచం మొత్తానిది. ఆయన చనిపోయేరంటే కొట్టడానికొచ్చేవాళ్లు కూడా ఉన్నారు.

ప్రేమకి వెల కట్టలేని కొన్ని అద్భుతాలు జరిగాయీమధ్య... బెంగళూరులో ఒక రోడ్‌కి బాలూ గారి పేరు పెట్టేరు.

కోయంబత్తూరు దగ్గర బాలూగారి పేర్న ఒక వనం నిర్మించి అందులో మొక్కలకి బాలూగారి పేరే పెడతారంట. ఇవి ఇప్పటికి. ఇకముందు ఇంకా ఎన్నెన్ని జరుగుతాయో... జరగబోతాయో.

ఐతే... నాకొకటనిపిస్తుంది...

బేతొవెన్ మళ్లీ పుట్టేడా? హేండిల్ మళ్లీ పుట్టేడా? మొజార్ట్ మళ్లీ పుట్టేడా? ఎక్కడో దూరంగా వున్న ఆళ్ల గురించొద్దుగానీ ద గ్రేట్ ఘంటసాల మాష్టారు మళ్లీ పుట్టేరా??

వీరిలో ఎవరైనా మళ్లీ పుట్టొచ్చేమోగానీ... శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం మళ్లీ ఇక పుట్టడం జరగదు. ఎందుకంటే అసలాయన పోతేగదా పుట్టడానికి???

❋



HANUMA VEGA
INTERNATIONAL COURIER AND LOGISTICS



# AROUND THE WORLD
# SHIPPING

**3-5 Days Door to Door Delivery**


Medicines | Food Items | Clothes | Gift Items | And Many More

CALL US NOW AT

**+1 (470) 384-9581**

HANUMA VEGA
INTERNATIONAL COURIER AND LOGISTICS

❖ చంద్రహాస్



# కొసరి పాటల కొసరాజు

*కొసరాజు పేరు వినగానే రైతుజీవితదర్పణాలవంటి గేయాలు, తాత్వికగీతాలు, అజరామర హాస్యగీతాలు, ఇంకా వందలాది పల్లెటూరిపాటలు, జానపదగీతాలు, ప్రబోధగీతాలు సినీ సంగీత ప్రియులకు జ్ఞాపకానికి వస్తాయి.*

*కొసరాజు రాఘవయ్య గారిని తొలుత సినీరంగానికి తన 'రైతుబిడ్డ ' సినిమా ద్వారా పరిచయం చేసినవారు గూడవల్లి రామబ్రహ్మంగారు. మలిప్రవేశం, చాలా కాలానికి 'పెద్దమనుషులు ' సినిమాతో గానీ జరగలేదు. 'పెద్ద మనుషులు', ఆ తర్వాత 'రాజూ పేద' పాటల విజయం, 'రోజులు మారాయి' సినిమాకు దారి తీసాయి. 'రోజులు మారాయి' అఖండ విజయంతో కొసరాజు సినీరంగంలో స్థిరపడ్డారు.*

*మరో మూడు దశాబ్దాలపాటు, అంటే జీవించి వున్నంతకాలం ఆయన పాటలు వ్రాసినా ప్రథమార్థంలో ప్రధానంగా 1970 ప్రాంతాలవరకూ వచ్చిన కొసరాజు పాటలకు ఉన్న విస్తృతి, వైవిధ్యం, నైగనిగ్యం ఆయనను 'జానపద కవిసార్వభౌమ' బిరుదానికి అర్హుణ్ణి చేశాయి. ఆ పాటలలో మరికొన్నింటిని ఈ వ్యాసంలో చూద్దాం.*

## హేమాంబరధరరావు, పద్మనాభం

సినిమారంగంలో అన్నదమ్ములు ఒకే సాంకేతిక శాఖలో అక్కడక్కడా కనబడినా సోదరులు ఒకే శాఖలో సమానంగా రాణించడం అరుదు.

ఉదాహరణకు బి.యన్.రెడ్డి, బి నాగిరెడ్డి ఇద్దరూ సినిమాలు నిర్మించినా బి. ఎన్. దర్శకుడిగా, నాగిరెడ్డి నిర్మాతగానే ప్రసిద్ధులు. సాలూరు రాజేశ్వరరావు, హనుమంతరావు సంగీత దర్శకులుగా పనిచేసినా, రాజేశ్వరరావుకున్న ప్రతిభ, కీర్తిప్రతిష్ఠలు హనుమంత రావుకు లేవనే చెప్పాలి.

దర్శకత్వ శాఖలో విశేషంగా, సరిసమానంగా విజయాలు సాధించిన అరుదైన అన్నదమ్ములు కొల్లి ప్రత్యగాత్మ, హేమాంబరధరరావు. వీరు దర్శకత్వం వహించిన మొదటి చిత్రాలు ఒకే సంవత్సరం (1961 లో) రిలీజ్ అయ్యాయి. వీరి పేర్లు కూడా అరుదైనవి. ప్రత్యగాత్మగారి పేరు మరీ ప్రత్యేకంగా ఉంటుంది.

ఈ పేర్ల గురించి ఆలోచిస్తూ రావి కొండలరావు ఒకసారి ఇలా రాశారు.





"ఈ పేరేమిటా అని, చాలామంది ఆలోచిస్తారు. సృష్టి చేసిన బ్రహ్మదేవుడిలో వున్న చైతన్యాన్ని, అందరి దేవుళ్లనీ మించి అతీతమైన శక్తి గల పరమేశ్వరుడిని 'ప్రత్యగాత్మ' అంటారని పెద్దలు చెప్పిన మాట. 'ప్రత్యగాత్మ' కలం పేరులా పెట్టుకున్న పేరేమో అను కొన్నాను మొదట్లో. తర్వాత ఆయన్నే అడిగితే, ఆ పేరు తన తండ్రి పెట్టినదే అని చెప్పారు ప్రత్యగాత్మ.

"ప్రత్యగాత్మ మంచి కథకుడు. ఆ జ్ఞానంతో సినిమాల్లో ప్రవేశించారు.

"ప్రత్యగాత్మ తమ్ముడు హేమాంబరధరరావు. ఇద్దరూ చాలా మంచి చిత్రాలు డైరక్టు చేశారు. ఎన్.టి.ఆర్, జయలలితలతో హేమాంబరధరరావు తీసిన కథానాయకుడు ఉన్నత శిఖరాలకు వెళ్లి విజయ పతాకం ఎగరేసింది. ప్రత్యగాత్మ కొన్ని సినిమాలకు సంభాషణలు కూడా రాశారు. ఆయన ముందుచూపు ఎంతటిదంటే ఒక తమిళ నవల మీద వచ్చిన సమీక్షను 'హిందు' పత్రికలో చదివి, మోజు పడి ఆ పుస్తకం కొని చదివించి, దాన్ని సినిమా కథగా మలచుకుని భార్యా భర్తలుగా తీస్తే ఘనవిజయం సాధించింది. ఆ తరువాత అది తమిళంలో సినిమాగా వచ్చింది. ఆ తొలి సినిమాతో గొప్ప దర్శకుడనిపించుకున్న ప్రత్యగాత్మ, కె.పి. ఆత్మ పేరుతో హిందీలో కూడా చిత్రాలు డైరక్టు చేశారు. ఆయన దర్శకత్వంలో నేను శ్రీమంతుడు, ముగ్గురు అమ్మాయిలులో నటించాను. ఆయన గట్టిగా మాట్లాడ్డం ఏ రోజూ వినలేదు. అసలు మాటే గట్టిగా వినిపించేది కాదు. ఆయన తమ్ముడు హేమాంబరధర రావు కూడా గట్టిగా మాట్లాడేవారు కాదు. నెమ్మదిగా, నిదానంగా మాట్లాడ్డం ఆ కుటుంబ విధానం కాబోలు."


ఈ ఇద్దరు అన్నదమ్ములు తీసిన సినిమాల్లో కొసరాజు చాలా పాటలు వ్రాశారు.

ప్రత్యగాత్మ దర్శకత్వం వహించిన భార్యాభర్తలు, కులగోత్రాలు, మంచి మనిషి మొదలైన సినిమాల్లోని కొసరాజు పాటలు ఇంతకు మునుపు చూశాం.

రచయితగా, దర్శకుడిగా రాణించిన అన్న బాట లోనే ప్రయాణిస్తూ మరో అడుగు ముందుకేసి దర్శక నిర్మాతగా అనేక చిత్రాలు రూపొందించారు హేమాం బరధరరావు.

హేమాంబరధరరావు తొలి చిత్రం తండ్రులు కొడుకులు (1961). కేవలం దర్శకత్వమేకాక ఆయన సాహసోపేతంగా రఘురాం ఫిలిమ్స్ పేరు మీద ఈ చిత్రాన్ని స్వయంగా నిర్మించారు. సోదరుడి తొలి చిత్రానికి కథ మాటలు సమకూర్చింది ఎవరో కాదు ప్రత్యగాత్మ.

ఈ సినిమాలో ఉన్న ఆరు పాటలలో సగం పాటలు కొసరాజు వ్రాశారు.




*నవ్వులు రువ్వే చిన్నదీ*
*నను కవ్విస్తున్నదీ* ॥న॥

*సిగ్గొలికిస్తున్నదీ*
*సైగలు చేస్తున్నదీ*
*రమ్మంటే ముద్దులగుమ్మ*
*రానే రానంటున్నది* ॥న॥

*ఒయ్యారపు నడకల*
*వూరిస్తున్నదీ*
*ఓహోయనిపిస్తూ వున్నదీ*
*మల్లెపూలు తెచ్చానంటే-*
*మనసు నీకె యిచ్చానంటే*
*అర్థమేమొ తెలియదుకాని*
*ఆహా... ఊహు... అన్నది...* ॥న॥

*అద్దంలో బొమ్మలాగా వున్నదీ*
*ఆ అందం నీదేనన్నదీ*
*వెన్నెల విరబూసిందంటే*
*విరులవాన కురిసిందంటే*
*అర్థమేమొ తెలియదుగాని*
*ఆహా... ఊహు... అన్నది...* ॥న॥

*గలగలనీ గాజులు ఘల్లుమన్నవీ*
*నా ఒళ్లూ ఝల్లుమన్నదీ*
*ఆపలేను తాపం అంటే-*
*నాపరాతి బండవు అంటే*
*అర్థమేమొ తెలియదుగాని*
*ఆహా... ఊహూ... అన్నదీ* ॥న॥

బ్రహ్మం, వాణి (పద్మనాభం, శారద) పెళ్లయినా కట్నం బాధల వల్ల కాపురానికి నోచుకోలేని వాళ్లు. రక రకాల వేషాలతో బ్రహ్మం భార్యను చూడటానికి వస్తూ ఉంటాడు. వీరి మీద- నవ్వులు రువ్వే చిన్నది నన్ను కవ్విస్తున్నది..., మేరే ప్యారీ వయ్యారి ఇటు చూడవే ఒకసారి... అన్న కొసరాజు పాటలున్నాయి. మూడవది కొసరాజు మార్కు వీధి ప్రదర్శన పాట- ఒకటి రెండు మూడు అది ఏంటో తెలుసా, నీకు తెలుసా ఐసరబజ్జ మామ... వీటిలో మచ్చుకు 'నవ్వులు రువ్వే చిన్నది' సాహిత్యం చూడండి.

ఈ పాటలే కాక ఈ సినిమాకోసం కొసరాజు అయిదు చక్కని సమస్యాపూరణ పద్యాలు వ్రాశారు.

మొదటి నాలుగు కందపద్యాలు అర్థచమత్కారంతో తేలికగా ఆస్వాదయోగ్యంగా ఉంటాయి.

చివరన ఉన్న ఉత్పలమాల శబ్దచమత్కారంతో అనుప్రాసలతో కావ్యస్థాయిలో అద్భుతంగా ఉన్నా, అర్థం తెలుసుకోవడానికి పండితులను ఆశ్రయించాల్సిందే. ఎదురు నడకతో ఈ పద్యం నడిపించిన తీరు కొసరాజుకు భాష మీద, ఛందస్సు మీద, ఉన్న పట్టు తెలియజేస్తుంది. ఆయన తన పన్నెండవ ఏటనే అవధానాలు చేశారు అన్నది ఇక్కడ మరోసారి జ్ఞాపకం చేసుకోవచ్చు.

**1.** కుప్పలు కావలి కాయగ
చెప్పుల జత తొడిగి కఱ్ఱ చేగొని కిర్ కిర్
చప్పుడుతో వచ్చెడి వెం
కప్పను చూడంగ పాము గడగడ వణికెన్

**2.** చిలిపి చలమయ్య ఒక్కడు
బులిపానికి పంచదార బొమ్మలు తేగా
తలుపుల సందుగ జొరబడి
ఎలుకలు తమ కలుగులోని కేనుగ నీడ్చెన్

**3.** జోరుగ దోసిమించి హు
షారుగ పయనించి భువికి చనుదెంచిన యూ
వీర గగారిన్ గగన వి
హారము లోకాలనే ఆహా యనిపించెన్

**4.** ఇన్నాళ్లకు తన కోరిక
లన్నియు ఫలియించె భాగ్యమని భావములో
నెన్నుచు రుక్మిణి దేవకి
కన్నకొడుకు భర్తయయ్యెగా యని మురిసెన్

రాలు మెరాలు వాలు నరాలు మెఱుంగుల
నూపురాలు వజ్రాల స
రాలు మేలు జవరాలు వరాలజిరాలు
తూలుహోరాలు తు
రాలు మండపు మురాలు తరాల సిరాలు సంధి తో
రాలు దుటుంగ రాలు బిగిరాల గనా జవరాలు
దాల్చెగిన్

"కప్పను చూడంగ పాము గడగడ వణికెన్.. హోరము లోకాలనే ఆహా యనిపించెన్... ఎలుకలు తమ కలుగులోనికేనుగు నీడ్చెన్... కన్నకొడుకు భర్తయయ్యెగా యని మురిసెన్... రాలు దుటుంగరాలు బిగిరాలగ నా జవరాలు దాల్చెగిన్- ఈ సమస్యలను పూరించిన తీరు రఘురామ్ ఫిలిమ్స్ వారి తండ్రులు కొడుకులు చిత్రంలో చూసి ఆనందించండి,'' అని ప్రచారం చెయ్యడం సినిమా పోస్టర్‌లో చూడవచ్చు. పద్యపాదాలు, సమస్యాపూరణలు ప్రచారానికి నియోగించిన హేమాంబరధరరావు అభినందనీయుడు.

## 2

రఘురాం ఫిలిమ్స్ పేరుమీదే హేమాంబరధరరావు 1964లో నిర్మించి దర్శకత్వం వహించిన కలవారి కోడలు సినిమాలో కొసరాజు రెండు పాటలు వ్రాశారు. ఒకటి- ఏమిటో ఈ విపరీతం... అన్న విషాదగీతం. రెండవది- నీ సొగసే లాగుతున్నది... అన్న హాస్యగీతం.

ఈ రెండో పాట సాహిత్యం ఇక్కడ చూడవచ్చు. హంస (గీతాంజలి) ప్రేమకోసం చలం, పద్మనాభం ఇద్దరూ పోటీపడటం ఇక్కడ సన్నివేశం. చలపతిరావు సంగీతం, పిఠాపురం-మాధవపెద్ది గానం.

వినోదాత్మకంగా ఉండే ఈ పాటలో చివర్లో అమ్మాయిని ఆకట్టుకోవటానికి సంగీతంలో పోటీకి కూడా ప్రయత్నించడం సరదాగా ఉంటుంది. ఆఖరున డొ.చి. (డొక్క చించేస్తా), వి.వి.మో. (వీపు విమానం మోత మోగిస్తా) అని వాళ్లు సంక్షేపాలతో తిట్టుకోవడం కూడా ఒక తమాషా.



నీ సొగసే లాగుతున్నది, నిను చూస్తూ వుంటే
నా మనసే వూగుతున్నదీ
ఓ వలపుల జిలిబిలి వయారి హంసా,
నీ సొగసే లాగుతున్నదీ
నీ నడకజూడ నడకందముజూడ,
నడకకు తగ్గ నాధుడు ఎవరే?
నాకన్నా నాధుడు ఎవరే? ॥నీ సొగసే॥

ఓ వలపుల జిలిబిలి వయారి హంసా,
నా వరాల హంసా-
నీ సొగసే లాగుతున్నదీ... ... ...
కాశీపట్నం చూపిస్తా, గంగాస్నానం చేయిస్తా
గోవిందా, గోవిందా, కొంగు పట్టుకుని గోవిందాయని
ఏడుకొండలూ ఎక్కేస్తా,
చంద్రమండలం చెక్కేస్తా ॥నీ సొగసే॥

కొండలు పిండిగ కొడతానే
ఆ పిండితో మేడలు కడతానే
మేడలో నిన్ను కూర్చోబెట్టి, ఊయలగట్టి ఊగిస్తానే
ఉయ్యాలో... జంపాలో ॥ నీ సొగసే॥

నీ కోసం నే పాడతా, నీకంటే బాగా పాడతా
మరి చెప్పలేదేం?
ఇప్పుడు చెప్పానుగా!
సానిస దనిపా మసగా మాపాదనిసా దనిసరి సనిదపగని
పానీసా, దనిసరి, నసనిప, పమగరి, సనిపమ, మమగగ
దిదిసని సానిసా ॥నీ సొగసే॥

మామా, మా మామా- మా మామ నూటికి సర్దార్
అత్తా మా అత్తా- మా అత్తంటేనే కబడ్దార్
ఇక కట్టిపెట్టవోయ్ నీ జోరూ
ఇక మూసిపెట్టవోయ్ నీ నోరూ
డో.చి.
వి.వి.మో

3

హాస్యనటుల్లో రేలంగి, రమణారెడ్డిల తర్వాత దశాబ్దాల తరబడి ప్రేక్షకులను అలరించిన వారిలో పద్మనాభం, అల్లు రామలింగయ్యలను చెప్పుకోవాలి.

పద్మనాభంగా అందరికీ తెలిసిన బసవరాజు వేంకట పద్మనాభరావు ఐదేళ్ల వయసు నుండే రంగస్థలం మీద, పదమూడేళ్లకే వెండితెర మీద నటజీవితం ప్రారంభించారు. పద్యనాటకాల అనుభవంతో ముందు ఆయన గాయకుడిగా సినీపరిశ్రమలోకి వచ్చారన్నది ఎక్కువమంది తెలియకపోవచ్చు. ఎల్.వి. ప్రసాద్‌గారి చొరవ వల్ల షావుకారు సినిమాలో, షావుకారు వల్ల పాతాళభైరవిలో వేసిన పాత్రలు నటుడిగా ఆయన జీవితాన్ని మలుపు తిప్పాయి.

రేలంగి తరువాత రాశిలోనూ వాసిలోనూ ఎక్కువ పాటలు హాస్యనటుల్లో పద్మనాభానికే దఖలు పడ్డాయి. ముఖ్యంగా హాస్య యుగళ గీతాలకు ఆయన పర్సనాలిటీ బాగా సరిపోయేది.

ఇప్పటికే ఈ వ్యాసాల్లో పద్మనాభంమీద చిత్రీకరించిన కొసరాజు పాటలు ఎన్నో చూశాం.

హేమాంబరధరరావు తీసిన సినిమాల్లో దరిదాపుగా ప్రతి సినిమాలోనూ పద్మనాభానికి ఒక మంచి కొసరాజు పాట ఉండేది.

రేఖా అండ్ మురళి ఆర్ట్స్ పతాకంపై పద్మనాభం నిర్మాతగా మంచి సినిమాలు నిర్మించారని అందరికీ తెలిసే ఉంటుంది. ఈ సంస్థ అదే పేరుతో నాటక సమాజంగా తొలుత మొదలైంది. పద్మనాభంగారి కుమారుడు మురళి, నటుడు వల్లం నరసింహారావుగారి అమ్మాయి రేఖ పేర్ల మీద ఈ సంస్థ ప్రారంభించబడింది. వీరుగాక గేయ రచయిత వీటూరి, సంగీత దర్శకుడు ఎస్.పి. కోదండపాణి, హేమాంబరధరరావు మొదలైనవారు ఈ సంస్థలో భాగస్వాములు.




ఈ సంస్థ పేరు మీద తీసిన మొదటి మూడు చిత్రాలకు- దేవత (1965), పొట్టి ప్లీడర్ (1966), శ్రీశ్రీశ్రీ మర్యాదరామన్న (1967)- హేమాంబరధరరావే దర్శకుడు. తర్వాత సినిమాలకి పద్మనాభమే సొంతంగా దర్శకత్వం చేశారు. కరోనాకాటుకి

బలైపోయి అశేషప్రజావాహినిని విషాదంలో ముంచెత్తి ఇటీవలే దివికేగిన సినీగాయకమౌళి ఎస్పీ బాల సుబ్రహ్మణ్యంగారికి తొలి అవకాశం లభించిన సినిమాగా శ్రీశ్రీశ్రీ మర్యాదరామన్న చరిత్రపుటల్లో ఈరోజు నిలిచిపోయింది.

రేఖా అండ్ మురళి సంస్థ సినిమాల్లో కొసరాజు పాటలు దేవత, పొట్టి ప్లీడర్, కథానాయక మొల్ల, ఆజన్మ బ్రహ్మచారి మొదలైన సినిమాల్లో ఉన్నాయి. వీటిలో దేవత సినిమాలోని మావూరు మదరాసు నా పేరు రాందాసు... పద్మనాభం ఎల్.ఆర్. ఈశ్వరితో కలిసి స్వయంగా పాడుకున్నారు. అన్నిటికంటే ఉత్కృష్టమైన

*చీకటి విచ్చునులే - వెన్నెల వచ్చునులే*
*ఎవుడో ఒకసారీ- ఏదో ఒకదారీ*
*దొరుకునులే బాటసారీ* ॥చీకటి॥

*అయినవాళ్లు లేరనీ దిగులు చెందకోయ్*
*ఉన్నవాళ్లె నావాళ్లని అనుకోవలెనోయ్*
*స్వేచ్ఛగా దిక్కులేని పక్షులు విహరించవా*
*హాయిగా నోరులేని పశువులు జీవించవా*
*భయమెందుకు? పద ముందుకు-*
*ఓయి బాటసారీ!* ॥చీకటి॥

*ఆశతోటి లోకమంత బ్రతుకుతుందిరా*
*అందులోనే కథ అంతా తిరుగుతుందిరా*
*కష్టానికి సౌఖ్యానికి లంకె వుందిరా*
*ఈ కాలచక్రమునాపగ ఎవరి తరమురా?*
*భయమెందుకు? పద ముందుకు-*
*ఓయి బాటసారీ!* ॥చీకటి॥



గీతం పొట్టి ప్లీడర్‌లోని చీకటి విచ్చునులే వెన్నెల వచ్చునులే... పాట.

ఘంటసాల గళం నుండి జాలువారి పద్మనాభం మీద సామాన్యంగా చిత్రీకరించబడే పాటలకు భిన్నంగా ఉండే ప్రబోధ గీతం ఇది. కొసరాజు పాటల్లో మనం చూసిన జయమ్ము నిశ్చయమ్మురా, వినవోయీ బాటసారి... వంటి పాటలు గుర్తుకు తెస్తుందీ పాట. మానసికంగా కృంగిపోయి ఉన్నవాళ్లకి ఈ పాటలు దివ్యౌషధాల్లా పనిచేస్తాయి.

ఘంటసాల అవసానదశలో వ్రాసుకొని పాడుకున్న,

ఇది సంధ్యా సమయం
ఇది చీకటి మూసిన తరుణం
బాటసారీ మేలుకో బాటసారీ తెలుసుకో
నాయనువారే ఉన్నారనీ నమ్మిన నాదే దోసమనీ

అని సాగే గీతం చీకటి విచ్చునులే పాటకు శైలీ పరంగా సన్నిహితంగా ఉంటూనే అర్థపరంగా సరిగ్గా వ్యతిరేకంగా ఉంటుంది.

## 4

మళ్లీ హేమాంబరధరరావు నిర్మించి దర్శకత్వం వహించిన సినిమాలకు వస్తే సుభాషిణీ ఆర్ట్ పిక్చర్స్ పేరుమీద 1967లో విడుదలై శతదినోత్సవాలు జరుపుకున్న ఆడపడుచు సినిమా గురించి చెప్పుకోవచ్చు.

చిత్రపు నారాయణమూర్తి (ఈయనే తర్వాత భక్తప్రహ్లాదకు దర్శకత్వం వహించారు) తమిళంలో 1952లో ఎన్ తంగై అనే సినిమా తీసి అదే కథతో 1953లో తెలుగులో నా చెల్లెలు సినిమా కూడా తీశారు. తెలుగు సినిమా పరాజయం పాలైంది. ఈ కథని కొద్దిగా మార్చి ఎల్.వి. ప్రసాద్ హిందీలో ఛోటీ బెహన్ (1959) సినిమా తీసి విజయం సాధించారు.

ఛోటీ బెహన్ కథ ఆధారంగా 1967లో కన్నడ తెలుగు భాషల్లో సినిమాలు వచ్చాయి. అప్పుడు తెలుగులో వచ్చినదే ఆడపడుచు సినిమా. ఈ సినిమాకు మాటలు వ్రాసింది మరలా ప్రత్యగాత్మ అయితే, స్క్రీన్ ప్లే సమకూర్చింది ఎల్వీ ప్రసాద్.





భారత చలనచిత్ర రంగం గర్వించదగ్గ నటుడు, దర్శకుడు, నిర్మాత ఎల్వీ ప్రసాద్‌ను దర్శకుల పతిగా అభివర్ణించారు ముళ్లపూడి వెంకటరమణ. 50వ దశకంలో తెలుగు సినీచరిత్రలో మైలురాళ్ల లాంటి చిత్రాలు దర్శకత్వం వహించిన ఎల్వీ ప్రసాద్, అప్పు చేసి పప్పుకూడు (1958) తర్వాత మళ్లీ తెలుగులో దర్శకత్వం చేయకపోవడం ఒక దురదృష్టం. ఛోటీ బెహన్ సినిమా తర్వాత ఆయన ఎక్కువగా హిందీలోనే సినిమాలు తీశారు.

ప్రస్తావన వచ్చింది గనక, ఎల్వీ ప్రసాద్ దర్శకత్వం చేసిన సినిమాల్లో కొసరాజు పాటలు వ్రాశారా అన్న ప్రశ్న రావచ్చు. వ్రాయలేదు.

అయితే ప్రసాద్ పర్యవేక్షణలో ఆయన శిష్యుడు యోగానంద్ దర్శకత్వంలో వచ్చిన లక్ష్మీ ఫిలింస్ వారి ఇలవేల్పు (1956) సినిమాలో కొసరాజు పాటలున్నాయి. స్పష్టంగా తెలియకపోయినా చింగ్లారీ ఈ యా చింగ్లారి..., గంప గయ్యాళి అదె గంప గయ్యాళి... పాటల్లో కొసరాజు ముద్ర స్పష్టంగా కనబడుతుంది. ప్రసాద్ ప్రొడక్షన్స్ పతాకంపై ఎల్వీ ప్రసాద్ నిర్మించిన ఇల్లాలు (1965) సినిమాలో తక తక తక తాళం దట్టు మామ... అనే కొసరాజు పాట ఉంది.

ఏదిఏమైనా ఎల్వీప్రసాద్ ప్రమేయం ఉన్న సినిమాల్లో చెప్పుకోదగ్గ కొసరాజు పాట హేమాంబరధర రావు తీసిన ఆడపడుచు సినిమాకు వ్రాసిన పాట. అది టి. చలపతిరావు సంగీతంలో ఘంటసాల పాడగా పద్మనాభం మీద చిత్రీకరించిన రిక్షావాలాను నేను... అన్న హిట్ పాట. ఆ పాట సాహిత్యం చూడండి.



రిక్షావాలాను నేను- పక్షిలాగ పోతానూ
కాళ్లు మాత్రమూ రెండే అయినా కదిలానంటే ఆగనూ
చిన్న కారునైన కొట్టేస్తానూ ॥రిక్షా॥

ఒంటిగ తిరిగే ఎంతోమందిని జంట కలిపి పంపించాను
ఒక ఇంటివాళ్లుగ చేశాను- ఏకాకిగ అల్లాడే నాపై
ఎవ్వరూ జాలి చూపరు- నవ్వుతూ జారిపోతారు ॥రిక్షా॥

ఆకాశానికి నిచ్చెన వేసి- గాలిమేడలే కట్టాను
పూలబాటలే వేశాను- అంతా కలయై దుమ్ముధూళితో
రోడ్డు పట్టుకుని వున్నాను
హై రోడ్డు మీద పడివున్నాను ॥రిక్షా॥

రేయింబవళ్లు శ్రమపడువాళ్లకు - పాడు తిండి కరువెందుకు
ఈ రేషను బాధలు ఎందుకు-
పైన వున్నవాడెవడో- వాడీ
ప్రశ్నకు జవాబు చెప్పాలి-
ఈ తేడాలేమిటో తేల్చాలి ॥రిక్షా॥

ఛోటీ బెహన్ సినిమాలోని మై రిక్షావాలా... పాట దీనికి మాతృక- రఫీ కంఠంలో శంకర్-జైకిషన్ సంగీతంతో భలేగా ఉంటుంది. చరణాలు దరిదాపుగా హిందీ పాటకు శైలేంద్ర వాడిన భావాలతోనే కొసరాజు వ్రాశారు. పల్లవి స్వతంత్రంగా హిందీ పాటకన్నా మెరుగ్గా ఉంటుంది. ముఖ్యంగా పక్షిలాగ పోతాను... అన్న మాట కవితాత్మకంగా ఉంటుంది.

5

1971లో సుభాషిణి ఆర్ట్ పిక్చర్స్ మీదే హేమాం బరధరరావు దర్శక నిర్మాతగా అదృష్ట జాతకుడు సినిమా తీశారు. ఇందులో అప్పులు చేయకురా నరుడా... అనే కొసరాజు పాట





అప్పులు చెయ్యకురా - నరుడా
తిప్పలు తప్పవురా - నరుడా
తిప్పలు తప్పవురా
గొప్పలకోసం అప్పులు చేస్తే
చిప్ప చేతికి వచ్చును గదరా- ॥అప్పులు॥

అప్పులు చేసే హరిశ్చంద్రుడు
ఆలుబిడ్డలను అమ్మెను గదరా
అప్పులు తీరక రామదాసుడు
బందిఖాన పాలయ్యెను గదరా ॥అప్పులు॥

పెళ్లి కోసమై వెంకటేశ్వరుడు
కుబేరుణ్ణి అప్పడిగెను గదరా
వడ్డీ బాధతో దిక్కుతోచక
కొండలెక్కి కూర్చుండెను గదరా ॥అప్పులు॥

అప్పంటే అది నిప్పులాంటిదీ
అంటుకుంటే అది వదలనంటదీ
అప్పు ఇచ్చినా, అప్పు తెచ్చినా
ఇద్దరి చేతులు కాలును గదరా- ॥అప్పులు॥

ఈ సినిమాలోని పాటల న్నిటిలో అత్యుత్తమంగా ఉంటుంది.

కొసరాజు సాహిత్యం, చలపతిరావు సంగీతం, మాధవపెద్ది గానం, పద్మనాభం అభినయం అన్నీ చక్కగా కుదిరిన ఈ పాట అప్పుచేసి పప్పుకూడు తినరా ఓ నరుడా... అని పింగళి వ్రాసిన పాటకు ప్రతిగా హాస్యంగా వ్యంగ్యంగా తత్వంలా కొసరాజు పూర్వవైభవం గుర్తుచేస్తుంది. ముఖ్యంగా చివరి చరణం.

ఎవరనుకున్నావ్ నన్నేమనుకున్నావ్... అనే హీరో హీరోయిన్‌న్ను బెదిరించే పాట కూడా కొసరాజు ఈ సినిమాకు వ్రాసారు. ఈ పాటలో రామారావు మోటుదనం చూడటం కాస్త కష్టం.

## 6


హేమాంబరధరరావు తీసిన సినిమాల్లో బహుశా అన్నిటికంటే ఎక్కువగా అఖండవిజయం సాధించిన సినిమా గోపాలకృష్ణ ప్రొడక్షన్స్ వారి కథానాయకుడు **(1969).** ఈ సినిమాతో ఈ వ్యాసాన్ని ముగిద్దాం.


కథానాయకుడు సినిమాలోని ఏడు పాటల్లో నాలుగు కొసరాజు, మూడు దాశరథీ వ్రాశారు. టీవీ రాజు స్వరపరచిన పాటలన్నీ విజయవంతమైనవే.

అయితే వీటిల్లో ఒక్క పాట కూడా నాయికా నాయకుల (జయలలిత ఎన్టీఆర్) ప్రేమపాట కాక పోవటం విశేషం. అన్నిటికంటే ఎక్కువగా జనాల్లో మార్మోగిన పాట వినవయ్య రామయ్యా ఏమయ్యా భీమయ్యా...

సినిమాల్లోకి రాకముందు రోజుల్లో ఎలక్షన్ల ప్రచారంలో కొసరాజు చురుగ్గా పాల్గొనేవారు. విరివిగా పాటలు వ్రాసి తనకు నచ్చిన వారి కోసం ప్రచారం చేసేవారు. ఆయన ఆత్మకథలో ఈ ఎన్నికల ముచ్చట్లు చాలా కనబడతాయి.

రంగుల రాట్నం సినిమాలో ఆయన వ్రాసిన ఎలక్షన్ పాట ఒకటి చూశాం.





వినవయ్యా రామయ్యా ఏమయ్యా భీమయ్యా
మనమంచే గెలిచిందయ్యా మనమాటే నిలిచిందయ్యా

అబద్ధాలు చెప్పేవాళ్లు అన్యాయం చేసేవాళ్లు
చిత్తు చిత్తుగా ఓడారయ్యా నెత్తికి చేతులు వచ్చినవయ్యా
॥విన॥

మహా నాయకులు త్యాగంజేసి మనకిచ్చిన స్వాతంత్ర్యం
కొందరి చేతుల పడనీకుండా అందరి సొమ్మని చెప్పాలి
॥విన॥

నిరుపేదల ప్రేమించేవాళ్లను నిజాయితీగ నడిచేవాళ్లను
పదవి వచ్చి వలచిందయ్యా జయలక్ష్మి వరించిందయ్యా
॥విన॥

దగాకోరులౌ దోపిడీదొంగలు తలకిందులౌతారయ్యా
నీతికి నిలబడు కథానాయకులు
జాతికి ప్రాణం పోసేరయ్యా ॥విన॥

ఈ వినవయ్య రామయ్య పాట ఎన్నికల్లో నెగ్గిన తర్వాత ఒక విజయోత్సవంలాగా అందరూ పాడుకునే పాట. ఒక మంచి మనిషి ఎన్నికల్లో గెలిచాడు అన్న సంతోషం, ఇక నుంచి అంతా మంచే జరుగుతుంది అన్న ఆశ, పాటంతా కనపడతాయి.

ఈ సినిమాలో ఎలక్షన్‌లో గెలిచిన కథానాయకుడిని (ఎన్టీఆర్) మోసం చేసి కుర్చీ దింపేస్తారు. మరో పదహారు ఏళ్ల తర్వాత (1985) ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న రోజుల్లో నాదెండ్ల భాస్కరరావు, కేంద్రంలోని ఇందిరాగాంధీ ప్రభుత్వం కలిసి ఆయనను పదవీచ్యుతుడిని చేసినప్పుడు ఈ కథానాయకుడు సినిమాను చాలామంది గుర్తుచేసుకున్నారు.

కథానాయకుడు సినిమాకు కొసరాజు వ్రాసిన ఇతర పాటలలో రావేలా దయలేదా... అన్న పిఠాపురం-మాధవపెద్ది (రాజబాబు-పద్మనాభం) పాటను గమనిస్తే అది ఇద్దరు ఇల్లరికపుటల్లుళ్ల మీద తీసిన పాట అని తెలుస్తుంది. ఇదిగాక పళ్లండి పళ్లు... అనే పళ్లమ్మి పాట, వయసు మళ్లిన బుల్లోడా... అన్న విలన్‌ను కవ్వించే పాట కూడా కొసరాజు వ్రాసినవే.

(సశేషం)




Razberry's
Making Moments Memorable

YOUR DAY ... YOUR VISION


Weddings • Sweet 16
Social Events • Corporate Events

\Razberrys.Banquet.center

834 State Rt 12
Flemington, NJ, 08825
908-782-2379 • 908-399-9459
www.razberrys.net

www.digitaltimes.co

# What's Next For You?



**Leverage Our Digital Marketing Expertise for Your Business Evolution With The times**

- Content Marketing
- Position 0 & Next Gen SEO
- Lead Gen to Door Knocks
- E-commerce Multiplication

Google Partner | facebook for business | Microsoft Gold Partner

DIGITAL TIMES

Encinitas, USA; Hyderabad & Bangalore, India | hello@digitaltimes.co

**+91 98480 16666 +1 424-253-0800**



# MEDICAL INSURANCE FOR VISITORS TO USA

## OUR SERVICES

- USA VISITOR INSURANCE
- INTERNATIONAL TRAVEL INSURANCE
- SCHENGEN / EUROPE INSURANCE
- TRIP CANCELLATION INSURANCE
- INTERNATIONAL STUDENT INSURANCE
- NEW IMMIGRANT INSURANCE



**MURALI TALLURI**
FOUNDER
+1 (512) 917-8686
murali@visitorsplaza.com

VISITORS PLAZA
Visitors Medical Insurance Experts

www.visitorsplaza.com | info@visitorsplaza.com
1.800.610.2567


UNDAVALLI
CONSTRUCTIONS
PAY 10% NOW
0%
INTEREST
TILL POSSESSION
668 LUXURY APARTMENTS
2 Bhk, 3 Bhk, 4 Bhk & 4 Bhk Duplex from
1200 SFT – 4160 SFT LUXURY FLATS
APRERA
APPROVED
JUST A FEW MINUTES DRIVE FROM VIJAYAWADA AND AP SECRETARIAT
Club House / Swimming Pool / Kids Pool / Multi-Purpose Function Hall / Mini Theatre
Amphitheatre / Cafeteria / Well Equipped Gymnasium / Aerobics / Meditation Hall / Jogging Track
Yoga Room / Health Spa / Children's Play Area / Outdoor Cricket Court / Basket Ball Court
Badminton Court / Shuttle Court / Elder Parks / Squash Court / Table Tennis / World Class Sports
Design By CREATIVEETHICS.COM
+919032932953 (INDIA)
P
SRIVALLI
PRAVAS
Your Heaven on Earth
LETS YOUR DREAMS COME TRUE
on VJA - GNT National Highway at KAZA TOLL PLAZA
Bank Loans Available
+1 314 256 9132 (USA) 88 99 11 8888 (INDIA)
sales@ucpl.io
www.ucpl.io